


# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

19.09.2026
శనివారం |రంగారెడ్డి
సంపుటి : 01 | సంచిక: 80
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.




## దానం నాగేందర్‌పై
# అనర్హత వేటు

### ఖైరతాబాద్‌కు ఉపఎన్నికకు రెడీ!

- ఖైరతాబాద్ ఎమ్మెల్యేపై హైకోర్టు కీలక తీర్పు
- బీఆర్ఎస్, బీజేపీ పిటిషన్లకు అనుకూలంగా నిర్ణయం
- పార్టీ మార్పు, ఎంపీగా పోటీపై కోర్టు కీలక వ్యాఖ్యలు
- తీర్పును గౌరవిస్తున్నా.. పోరాటం కొనసాగిస్తా: దానం నాగేందర్ వెల్లడి
- ఉపఎన్నిక వస్తే పోటీకి సిద్ధమన్న ఎమ్మెల్యే
- సుప్రీంకోర్టుకు వెళ్లే ఆలోచన లేదని వెల్లడి
- తీర్పుపై హర్షం వ్యక్తం చేసిన బీఆర్ఎస్ నేతలు
- ఖైరతాబాద్‌లో మళ్లీ రాజకీయ వేడి.. వ్యూహాలపై ఆసక్తి

5లో..

**హైదరాబాద్, సెప్టెంబర్ 18, అనంత జనశక్తి న్యూస్**
రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిమాణం చోటు చేసుకుంది. ఖైరతాబాద్ శాసనసభ్యుడు దానం నాగేందర్‌కు తెలంగాణ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై ఎమ్మెల్యేగా గెలిచి.... అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరిన దానం నాగేందర్ సభ్యత్వంపై న్యాయస్థానం తీవ్ర నిర్ణయం తీసుకుంది. ఆయనపై అనర్హత వేటు వేస్తూ కీలక తీర్పును వెలువరించింది.


**బీఆర్ఎస్, బీజేపీ పిటిషన్లకు ఆమోదం**
గత శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఖైరతాబాద్ నుంచి గెలుపొందిన దానం నాగేందర్, ఆ తర్వాత మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ మారిన ఆయనపై ఎమ్మెల్యేగా అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్, బీజేపీ నేతలు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై సమగ్ర విచారణ జరిపిన న్యాయస్థానం.... ప్రతిపక్షాల వాదనలతో ఏకీభవించి వారి పిటిషన్లను పునఃసమీక్షించి ఆమోదించింది.
శాసనసభ సభ్యుడిగా ఉంటూనే దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీ తరపున సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయడాన్ని హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూ మరో పార్టీ గుర్తుపై లేదా అధికారికంగా ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగడం పార్టీ ఫిరాయింపుల చట్టం కిందకే వస్తుందని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ అంశాలన్నింటినీ ప్రాతిపదికగా తీసుకుంటూ ఆయనపై అనర్హత వేటు వేస్తున్నట్లు ధర్మాసనం వెల్లడించింది.
హైకోర్టు ఇచ్చిన తీర్పుపై దానం నాగేందర్... సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం ఉంది. హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే అక్కడ ఏదైనా ఉపశమనం లభిస్తుందా లేక హైకోర్టు ఇచ్చిన తీర్పునే సమర్థిస్తుందా అన్నది చర్చనీయాంశంగా మారింది.

**న్యాయం గెలిచింది - పాడి కౌశిక్ రెడ్డి**
ఈ తీర్పుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడారు. ఈ తీర్పు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపపెట్టు వంటిదని అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తాము చేసిన న్యాయ పోరాటం ఫలించిందని వ్యాఖ్యానించారు. దానం నాగేందర్ మాత్రమే కాకుండా మరో 8 మంది ఎమ్మెల్యేల కేసులోనూ ఇదే తరహా తీర్పు వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఖైరతాబాద్ ఉపఎన్నికలో బీఆర్ఎస్ తప్పకుండా విజయం సాధిస్తుందన్నారు.



## సృష్టి ఉన్నంతవరకూ ధర్మం ఉంటుంది

- సమస్త సంతోషానికీ అదే మూలం
- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్
- ధర్మం వృద్ధాప్యానికి పరిమితం కాదు
- మనిషి జీవితం ప్రారంభం నుంచి ఎండ్ వరకు



2లో..

## అసెంబ్లీ నిర్మాణానికి రూ.661 కోట్లు

### మలి విడత ల్యాండ్ పూలింగ్ రైతులకు కనీస కౌలు రూ. 40వేలు: రాష్ట్ర మంత్రి పి.నారాయణ

**అమరావతి,సెప్టెంబర్ 18 : అనంత జనశక్తి న్యూస్**
రాజధాని అమరావతి నడిబొడ్డున అత్యంత ఎత్తైన భవన నిర్మాణాల్లో ఒకటైన అసెంబ్లీ(ఐకానిక్ భవనం) స్పైర్(250 మీటర్లు) నిర్మాణానికి టెండర్లు పిలవడానికి రూ.661 కోట్లకు పరిపాలనామోదం ఇవ్వడం జరిగిందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామాత్యులు పొంగూరు నారాయణ తెలిపారు.

5లో..



## డీజేల విషయంలో ఇబ్బందులు రావొద్దు

- పోలీసులకు లోకేష్ ఆదేశాలు
- వినాయక చవితి నిమజ్జనం వేళ ఘటన
- డీజేలకు పర్మిషన్ లేదంటున్న పోలీసులు
- హోంమంత్రి, డీజీపీ జోక్యం చేసుకోవాలి

2లో..



## సురేందర్ కోలీ ఆత్మహత్య

- నిఠారీ హత్యల కేసు నిందితుడు
- ఉత్తరాఖండ్‌లోని నివాసంలో సూసైడ్.. ఉరి వేసుకుని.. ఆత్మహత్య

2లో..

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18, అనంతజనశక్తి న్యూస్**
అలహాబాద్ హైకోర్టు తీర్పుతో నిఠారీ హత్యల కేసు నుంచి విముక్తి పొందిన సురేందర్ కోలీ (50) శుక్రవారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హరిద్వార్‌లోని సప్త సరోవర్ రోడ్డులో గల లాల్ మాతా ఆలయం సమీపంలో ఉన్న ఒక టీ కొట్టులో ఆత్మహత్య చేసుకుని అనుమానాస్పద స్థితిలో శవమై కనిపించాడు. గత కొన్ని నెలలుగా హరిద్వార్‌లో నివాసముంటున్న కోలీ, ఇటీవల ఒక టీ కొట్టును అద్దెకు తీసుకుని నడుపుతున్నాడు.

## మమతా బెనర్జీకి బిగ్ షాక్

- నందిగ్రామ్ పోటీ నుంచి అభ్యర్థి విత్‌డ్రా
- సీఎం సువేందుతో భేటీ తర్వాత సంచితా ప్రధాన్ కీలక నిర్ణయం
- ఇటీవల సంచితా అభ్యర్థిత్వాన్ని ప్రకటించిన మమతా
- సీఎంతో భేటీ తర్వాత గంటల్లోనే కీలక పరిణామం



**కోల్‌కతా, సెప్టెంబర్ 19, అనంతజనశక్తి న్యూస్**
ఇప్పటికే పార్టీని, ఎన్నికల గుర్తును కోల్పోయిన తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, మాజీ సీఎం మమతా బెనర్జీకి బిగ్ షాక్ తగిలింది. రాబోయే నందిగ్రామ్ ఉప ఎన్నికల బరి నుంచి మమతా వర్గం అభ్యర్థి విత్ డ్రా అయ్యారు. నందిగ్రామ్ బై ఎలక్షన్స్ కోసం మమతా వర్గం తమ అభ్యర్థిగా సంచితా ప్రధాన్ డే అనే మహిళా టీచర్‌ను ప్రకటించారు.

2లో..

### పోలవరం ఎత్తు విషయంలో
## జగన్ దుష్ప్రచారం

- గత ప్రభుత్వ పాపాలను కూటమి ప్రభుత్వంపై రుద్దే ప్రయత్నం.
- ప్రశ్నార్థకమైన పోలవరంను, పూర్తవుతుందనే భరోసా కల్పించాం.
- పూర్తిస్థాయిలోనే పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం.
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

5లో..



## బీసీల జనాభా తక్కువగా చూపే కుట్ర

### కేంద్రంపై కవిత విమర్శలు


**హైదరాబాద్, సెప్టెంబర్ 18, అనంతజనశక్తి న్యూస్**
బీసీ కులాల జనాభాను తక్కువ చేసి చూపే కుట్ర జరుగుతోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత విమర్శించారు. ది యునైటెడ్ ఫోరం ఫర్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్, సకల జన సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'పాలిటిక్స్ బియాండ్ క్యాస్ట్' సదస్సులో మాట్లాడుతూ.. కేంద్రం చేసే జనగణనలో బీసీ ఉప కులాలను కూడా కలిపి లెక్కించాలని డిమాండ్ చేశారు. కులం కోసం ప్రత్యేక కాలం ఉండాల్సిందే అని స్పష్టం చేశారు. కులగణనకు ఇంకా నాలుగు నెలల సమయం ఉందని.. కేంద్రం వెంటనే నిర్ణయం తీసుకోవాలన్నారు.

2లో..

## అంబటి రాంబాబుకు ఈడీ నోటీసులు

- 11వ తేదీనే నోటీసులు ఇచ్చాం
- స్పష్టం చేసిన ఈడీ అధికారులు
- ఆఫీసుకు రావాలని నోటీసుల్లో వెల్లడి

2లో..



## ఒకరిని ఒకరు కాపాడుకుంటున్నారు

- కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒకటే
- బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి
- గత ప్రభుత్వ హయాంలో లక్షల కోట్ల స్కామ్‌లు
- ఈ విషయం సీఎం రేవంత్ రెడ్డే చెప్పారు
- మరి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?



2లో..

**హైదరాబాద్, సెప్టెంబర్ 18, అనంతజనశక్తి న్యూస్**
గత ప్రభుత్వంలో లక్షల కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని.. మరి కేసులు పెట్టి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. ఆ భూమిని ఎందుకు తిరిగి తీసుకోవడం లేదని నిలదీశారు. 23 లక్షల ఎకరాలు భూ మార్పిడి జరిగిందని ముఖ్యమంత్రి చెప్పారని.. ఆ రిజిస్ట్రేషన్‌లను ఎందుకు రద్దు చేయడం లేదని అడిగారు. గతంలో ధరణి, ఇప్పుడు భూ భారతితో లక్షల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని చెబుతున్నారన్నారు. సెట్ పేరుతో వ్యవహారాన్ని సెట్ చేసుకోవాలని చూస్తున్నారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్షల కోట్ల రూపాయల భూముల వివరాలను ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు.

## రెడ్ల పౌరుషాన్ని కాపాడుతుంది

- మా పార్టీ రాయలసీమ ఒరిజనల్ రెడ్లది
- చంద్రబాబు, జగన్‌కు ఓట్ల కోసం రెడ్లు కావాలి
- విజయసాయిరెడ్డి సంచలన ప్రకటన
- రాయలసీమకు ఇద్దరు ఏం చేశారంటూ ప్రశ్న

2లో..



**అమరావతి, సెప్టెంబర్ 18, అనంత జనశక్తి న్యూస్**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తాము స్థాపించబోయే పార్టీ టీడీపీ, వైఎస్సార్‌సీపీకి ప్రత్యామ్నాయం కాబోతుందంటున్నారు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి. తమ పార్టీ కచ్చితంగా అధికారంలోకి వస్తుందని.. రాయలసీమలో ప్రాజెక్టులు పూర్తిచేస్తామన్నారు. తాము పెట్టబోయే పార్టీని గెలిపిస్తే యువతరంలో ఒకరు ముఖ్యమంత్రి అవుతారన్నారు. తాను ముఖ్యమంత్రి పోటీలో ఉండనని.. పార్టీ నుంచి ఎవరో ఒకరు ముఖ్యమంత్రి అవుతారని తేల్చి చెప్పారు.

## సృష్టి ఉన్నంతవరకూ

# ధర్మం ఉంటుంది

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18, అనంతజనశక్తి న్యూస్**

'ధర్మం' అనేది కేవలం వృద్ధాప్యానికి మాత్రమే పరిమితమైనది కాదని, మనిషి జీవితం ప్రారంభం నుంచి అంతం వరకూ తోడుగా ఉండేదని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్ సంఘచాలక్ మోహన్ భాగవత్ స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో శుక్రవారం నిర్వహించిన 'యువ ధర్మ సంసద్' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. సాధారణంగా ధర్మం గురించి వృద్ధులే మాట్లాడతారనే భావన ఉన్న నేటి రోజుల్లో, యువత 'ధర్మం' గురించి ఆలోచించడం, చర్చించడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని ఆయన అన్నారు. గీత, రామాయణాలను రిటైర్ అయిన తర్వాతే చదవాలనే అపోహ సమాజంలో ఉందని, కానీ అది ఎంతమాత్రం నిజం కాదని భాగవత్ చెప్పారు. ధర్మం ఆధారంగానే విశ్వం నడుస్తుందని పేర్కొన్నారు.

'ప్రతిదీ నా నియాంత్రణలోనే ఉంది, నా ప్రకారమే జరగాలి' అనే అహంకారంతో నడుచుకునే వ్యక్తి తీవ్రమైన భ్రమలో పడతాడని, అలా అనుకోవడం పొరపాటని హెచ్చరించారు. ధర్మాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలంటే ముందుగా మనస్సులో ఉన్న పాత, స్థిరపడిపోయిన అపోహల నుంచి బయటపడాలని ఆర్ఎస్ఎస్ చీఫ్ పిలుపునిచ్చారు. సృష్టి ఆరంభం నుంచి అంతం వరకూ ధర్మం ఉనికిలో ఉంటుందని.. పుట్టుక నుంచి మరణం వరకూ ప్రతి ఒక్కరి జీవితంలోనూ అది భాగమేనని, సమస్త సంతోషానికి ధర్మమే మూలకారణమని మోహన్ భాగవత్ తెలిపారు.

# మమతా బెనర్జీకి బిగ్ షాక్



(మొదటి పేజీ తరువాయి)

అయితే, ఆమె పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారితో భేటీ అయిన కొన్ని గంటల్లోనే తన అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించారు. సువేందుతో భేటీ తర్వాత ఎన్నికల పోటీ నుంచి బయటకు రావడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

మరోవైపు, మమతా బెనర్జీకి రాజకీయ తలనొప్పులు మరింత ఎక్కువయ్యాయి. ఇప్పటికే టీఎంసీలో వర్గ పోరు తీవ్రమైంది. ఈ నేపథ్యంలో ఈసీ టీఎంసీ పేరు, ఎన్నికల గుర్తును ఫ్రీజ్ చేసింది. మమతా వర్గానికి ''ఫుట్ బాల్ ప్లేయర్'' గుర్తు, రిటబ్రత బెనర్జీ నేతృత్వంలోని తిరుగుబాటు వర్గానికి ''ఎన్వలప్ కవర్'' గుర్తును కేటాయించింది. ఈ గుర్తులపైనే రెండు వర్గాలు ఉప ఎన్నికల్లో పోటీ చేయబోతున్నాయి. ఈసీ ఈ గుర్తుల కేటాయింపు చేసిన కొన్ని గంటల్లోనే మమతాకు సంచితా బిగ్ షాక్ ఇచ్చారు.

ఈ ఏడాది జరిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ ఘోర పరాజయం చవిచూసింది. మమతా బెనర్జీ భవానీపూర్ నుంచి ఓడిపోయారు.ఈ స్థానం నుంచి పోటీ చేసిన సువేందు అధికారి మమతను చిత్తుగా ఓడించారు. సువేందు భవానీపూర్‌తో పాటు నందిగ్రామ్ నుంచి పోటీ చేసి రెండు చోట్ల విజయం సాధించారు. ఎన్నికల తర్వాత భవానీపూర్ నుంచి ఎమ్మెల్యేగా కొనసాగడానికే ఇష్టపడి, నందిగ్రామ్‌కు రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో నందిగ్రామ్‌కు బైఎలక్షన్లు అనివార్యమయ్యాయి. టీఎంసీ ఘోర పరాజయం తర్వాత వర్గపోరు ముదిరింది.

# ఆర్టీసీలో మోగిన ఎన్నికల నగారా

**- షెడ్యూల్ విడుదల.. అక్టోబరు 9న పోలింగ్, 17న ఫలితాలు వెలువడనున్నాయి**

**హైదరాబాద్, అనంత జనశక్తి న్యూస్**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో ఎన్నికల శంఖారావం మోగింది. దాదాపు ఎనిమిదేళ్లుగా తీవ్ర ఉత్కంఠగా ఎదురుచూస్తున్న గుర్తింపు సంఘం (యూనియన్) ఎన్నికలకు ఎట్టకేలకు ఆర్టీసీ యాజమాన్యం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు సమగ్రమైన ఎన్నికల షెడ్యూల్‌ను అధికారులు అధికారికంగా విడుదల చేశారు.

ఈనెల 21వ తేదీ నుంచే ఎన్నికల ప్రక్రియ అధికారికంగా ప్రారంభం కానుంది. అక్టోబరు 9న ఓటింగ్ ప్రక్రియ నిర్వహిస్తారు. అనంతరం అక్టోబరు 17న ఓట్ల లెక్కింపు పూర్తి చేసి విజేతలను ప్రకటించనున్నట్లు ఆర్టీసీ ఉన్నతాధికారులు వెల్లడించారు.

చివరిసారిగా ఆర్టీసీలో 2016 జులై 19న గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగాయి. నిబంధనల ప్రకారం నాలుగేళ్ల కాలపరిమితి పూర్తయిన తర్వాత 2018లోనే ఈ ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ..... అప్పటి ప్రభుత్వం పలు కారణాలతో వాయిదా వేస్తూ వచ్చింది. దాంతో ఎనిమిది సంవత్సరాలుగా కార్మికుల తరపున మాట్లాడే చట్టబద్ధమైన కమిటీ లేకుండాపోయింది. మళ్లీ ఇన్ని సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత మళ్లీ ఇప్పుడు పోలింగ్ నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు.

గుర్తింపు సంఘం అంటే ఏంటి...?

ఆర్టీసీ సంస్థలో ఎన్నో రకాల కార్మిక సంఘాలు, యూనియన్లు ఉన్నప్పటికీ.. ఎన్నికల్లో విజయం సాధించిన సంఘాలనే చట్టబద్ధమైన "గుర్తింపు సంఘం"గా పరిగణిస్తారు. ఈ ఎన్నికలను రీజియన్ స్థాయి మరియు రాష్ట్ర స్థాయిల్లో వేర్వేరుగా జరుపుతారు. రెండు స్థాయిలకు సంబంధించి ఓటర్లకు వేర్వేరు బ్యాలెట్ పత్రాలను అందిస్తారు. కార్మికుల హక్కుల రక్షణలో గుర్తింపు సంఘానిదే ప్రధాన పాత్ర. ఆర్టీసీ కార్మికుల వేతనాల పెంపు, సీఆర్‌తో పాటు జీతాల సవరణ, బోనస్‌లు, కరువు భత్యం (డీఏలు), పెండింగ్ బకాయిలు, సర్వీసు నిబంధనలలో మార్పులు, డిపోల పనివేళలు వంటి అత్యంత కీలకమైన సమస్యలపై నేరుగా ఆర్టీసీ యాజమాన్యంతో మరియు ప్రభుత్వంతో అధికారిక చర్చలు జరిపే ఏకైక చట్టబద్ధమైన హక్కు ఈ యూనియన్‌కే ఉంటుంది. కార్మికుల సంక్షేమానికి సంబంధించి యాజమాన్యంతో చట్టబద్ధ ఒప్పందాలు చేసుకోవడంలోనూ గుర్తింపు సంఘం కీలక పాత్ర పోషిస్తుంది.

# ఒకరిని ఒకరు కాపాడుకుంటున్నారు

(మొదటి పేజీ తరువాయి)

ఫారెస్ట్ భూములు ఎవరి ఆధీనంలో ఉన్నాయని అడిగారు. జగన్నాటకంతో ఒకరిని ఒకరు కాపాడుకుంటున్నారని ఆరోపించారు. జ్యుడీషియల్ విచారణ జరిపించాలని.. తమ వద్ద ఆధారాలు ఉన్నాయని మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. తాము అడిగిన లక్షల కోట్ల రూపాయల అవినీతిపై మాట్లాడలేదన్నారు. జ్యుడీషియల్ విచారణ జరిపే వరకు బీజేపీ పోరాటం ఆపదని స్పష్టం చేశారు. పార్ట్ వన్ బీలో 5 లక్షల ఎకరాలు క్లియర్ చేశామన్నారని.. వాటికోసం ప్రత్యేక అప్లికేషన్లు ఏమైనా ఉన్నాయా అని ప్రశ్నించారు. ఆ ఫార్ములాను అందరికీ వివరిస్తే మిగిలిన 25 లక్షల ఎకరాలను కూడా రిలీజ్ చేసేందుకు అవకాశం ఉంటుంది కదా.. అందులో ఉన్న మతలబు ఏంటో ప్రభుత్వ పెద్దలు తెలపాలని మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.

**వాళ్ల తరపున పోరాడుతున్నాం: పాయల్ శంకర్**

'22ఏ లో మీరు తప్పు చేయకపోతే మీకెందుకు భయం. మాకెందుకు సభలో మాట్లాడానికి సమయం ఇవ్వడం లేదు' అని బీజేఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ ప్రశ్నించారు. లక్షల మంది రైతుల భూములను నిషేధిత జాబితాలో పెట్టి ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. నిషేధిత జాబితాలో కలిపి ఇబ్బంది పడుతున్న వాళ్ల తరపున పోరాడుతున్నామని అన్నారు. ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా 22ఏ బాధితుల కోసం ఇందిరాపార్క్ దగ్గర ధర్నా చేశామని పాయల్ శంకర్ వెల్లడించారు.



# రెడ్ల పౌరుషాన్ని కాపాడుతుంది

(మొదటి పేజీ తరువాయి)



తాను పెట్టబోయే పార్టీ ఏపీలో మూడో ప్రత్యామ్నాయంగా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. తన పార్టీకి ఓటు వేస్తే సమాజానికి మంచి చేసే యువతను ముఖ్యమంత్రిని చేస్తానని.. తాను వెంట నిలబడి ఏపీకి దిశానిర్దేశం చేస్తానన్నారు విజయసాయిరెడ్డి. అనంతపురంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు.

రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి సీఎంలుగా పనిచేసిన ఇద్దరూ రాయలసీమ ప్రాంతం వారేనన్నారు. రాయలసీమ కేంద్రంగా ఏదైనా అభివృద్ధి చేశారా అంటూ జగన్, చంద్రబాబులను ప్రశ్నించారు. చంద్రబాబు, జగన్ కుటుంబాలకు రాయలసీమ పట్ల నిజమైన ప్రేమ ఉందా.. ఓట్ల కోసం రెడ్లు కావాలి.. ఓట్ల కోసం ఫ్యాక్షన్ రాజకీయాలు చేస్తారంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు విజయసాయిరెడ్డి. ఈ రెండు కుటుంబాలు రాయలసీమలో కాకుండా.. వేరే ప్రాంతంలో స్థిరపడి ఆస్తులు సంపాదించుకుంటున్నారని ఆరోపించారు. తమ పార్టీ రాయలసీమ ఒరిజినల్ రెడ్ల పౌరుషాన్ని, ఆత్మగౌరవాన్ని కాపాడే పార్టీ అని.. అదే సందర్భంలో తమ పార్టీ అన్ని కులాలను, మతాలను గౌరవిస్తుందన్నారు. విజయదశమి తర్వాత కొత్త పార్టీని ఏర్పాటు చేస్తామని విజయసాయిరెడ్డి ప్రకటించారు.

ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం వెంటనే రెడ్ల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విజయసాయిరెడ్డి డిమాండ్ చేశారు. రెడ్లపై ప్రేమ లేదని.. కేవలం ఓట్ల కోసం రాజకీయం చేస్తారా అంటూ ప్రశ్నించారు. వైఎస్ జగన్, చంద్రబాబు కోసం రక్తం చిందిస్తామని ప్రతి గ్రామంలో యువత చెబుతున్నారని.. ఆ రెండు కుటుంబాల కోసం కాకుండా రాష్ట్రం కోసం యువత ముందుకు రావాలని విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. కొత్త తరం రాజకీయాల్లోకి రావాలని.. రెండు కుటుంబాలు ఉన్నంత కాలం రాష్ట్రం బాగుపడదన్నారు. చంద్రబాబు, జగన్ శ్రీభాగ్ ఒడంబడిక ఏమయ్యిందో చెప్పాలని ప్రశ్నించారు. రాయలసీమ ప్రాంతంలో ప్రజలకు ఉపాధి లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వలసలు కొనసాగుతున్నాయి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ప్రతి ఒక్కరి నెత్తిన రూ.5 లక్షల అప్పు ఉందని.. పుట్టబోయే బిడ్డకు కూడా అప్పు ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ గంజాయి సాగులో 15 ఏళ్లుగా ముందంజలో ఉందని విమర్శించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే పోటీ తత్వం ఉండాలన్నారు. మొత్తానికి విజయసాయిరెడ్డి కొత్త పార్టీని ఏర్పాటు చేస్తూనే.. చంద్రబాబు, జగన్‌లను టార్గెట్ చేస్తున్నారు.

# డీజేల విషయంలో ఇబ్బందులు రావొద్దు

**అమరావతి, సెప్టెంబర్ 18, అనంతజనశక్తి న్యూస్**



రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి సీఎంలుగా పనిచేసిన ఇద్దరూ రాయలసీమ ప్రాంతం వారేనన్నారు. రాయలసీమ కేంద్రంగా ఏదైనా అభివృద్ధి చేశారా అంటూ జగన్, చంద్రబాబులను ప్రశ్నించారు. చంద్రబాబు, జగన్ కుటుంబాలకు రాయలసీమ పట్ల నిజమైన ప్రేమ ఉందా.. ఓట్ల కోసం రెడ్లు కావాలి.. ఓట్ల కోసం ఫ్యాక్షన్ రాజకీయాలు చేస్తారంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు విజయసాయిరెడ్డి. ఈ రెండు కుటుంబాలు రాయలసీమలో కాకుండా.. వేరే ప్రాంతంలో స్థిరపడి ఆస్తులు సంపాదించుకుంటున్నారని ఆరోపించారు. తమ పార్టీ రాయలసీమ ఒరిజినల్ రెడ్ల పౌరుషాన్ని, ఆత్మగౌరవాన్ని కాపాడే పార్టీ అని.. అదే సందర్భంలో తమ పార్టీ అన్ని కులాలను, మతాలను గౌరవిస్తుందన్నారు. విజయదశమి తర్వాత కొత్త పార్టీని ఏర్పాటు చేస్తామని విజయసాయిరెడ్డి ప్రకటించారు.

ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం వెంటనే రెడ్ల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విజయసాయిరెడ్డి డిమాండ్ చేశారు. రెడ్లపై ప్రేమ లేదని.. కేవలం ఓట్ల కోసం రాజకీయం చేస్తారా అంటూ ప్రశ్నించారు. వైఎస్ జగన్, చంద్రబాబు కోసం రక్తం చిందిస్తామని ప్రతి గ్రామంలో యువత చెబుతున్నారని.. ఆ రెండు కుటుంబాల కోసం కాకుండా రాష్ట్రం కోసం యువత ముందుకు రావాలని విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. కొత్త తరం రాజకీయాల్లోకి రావాలని.. రెండు కుటుంబాలు ఉన్నంత కాలం రాష్ట్రం బాగుపడదన్నారు. చంద్రబాబు, జగన్ శ్రీభాగ్ ఒడంబడిక ఏమయ్యిందో చెప్పాలని ప్రశ్నించారు. రాయలసీమ ప్రాంతంలో ప్రజలకు ఉపాధి లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వలసలు కొనసాగుతున్నాయి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ప్రతి ఒక్కరి నెత్తిన రూ.5 లక్షల అప్పు ఉందని.. పుట్టబోయే బిడ్డకు కూడా అప్పు ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ గంజాయి సాగులో 15 ఏళ్లుగా ముందంజలో ఉందని విమర్శించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే పోటీ తత్వం ఉండాలన్నారు. మొత్తానికి విజయసాయిరెడ్డి కొత్త పార్టీని ఏర్పాటు చేస్తూనే.. చంద్రబాబు, జగన్‌లను టార్గెట్ చేస్తున్నారు.

# బీసీల జనాభా తక్కువగా చూపే కుట్ర

(మొదటి పేజీ తరువాయి)




ఆలోచనా విధానం మారితేనే కుల వివక్ష నిర్మూలన సాధ్యమవుతుందని తెలిపారు. కులం అనేది చాలా కోణాలతో కూడిన జఠిలమైన సమస్య అని అన్నారు. ఈ సమస్య పరిష్కారానికి కూడా చాలా పరిష్కారాలు అవసరం ఉంటాయని తెలిపారు. ముఖ్యంగా రాజ్యాధికారంలో అన్ని కులాలను భాగస్వామ్యం చేస్తూనే వారిని ఆర్థికంగా బాగుచేయాలని సూచించారు. ఈ కుల వివక్ష అనే రోగాన్ని కచ్చితంగా పొగొట్టాల్సిన అవసరం ఉందన్నారు.

తెలంగాణ ఉద్యమంలో జై తెలంగాణ అనేందుకు భయపడిన వాళ్లను కూడా బయటకు వచ్చి గట్టిగా మద్దతు తెలిపేలా చేశామని కవిత అన్నారు. బతుకమ్మ, బోనాలు ఎత్తుకుంటే లక్షలాది మంది ఆడవాళ్లు వచ్చి తెలంగాణ ఉద్యమానికి జై కొట్టారని చెప్పారు. ఆ పోరాటాల ఫలితంగా తెలంగాణను సాధించుకున్నామని.. అదే విధంగా కులాల విషయంలోనూ పరిష్కారాలు వెతకాల్సి ఉందన్నారు. కేంద్రం చేసే జనాభా గణనలో కులాల జాబితాలో ఓబీసీ కాలం పెట్టాల్సిందే అని అన్నారు. అదే విధంగా డ్రాప్ బాక్స్ అనేది కూడా కులగణనలో ఉండాలన్నారు. కేంద్రం జనాభా గణనలో బీసీ అనే కాలం మాత్రమే పెడతామని చెబుతోందని.. కానీ బీసీల్లో ఉపకులాల కాలం కూడా ఉండాలనే కోరుతున్నామని తెలిపారు. దేశంలో ఒకే కులానికి సంబంధించి ఒక్కో రాష్ట్రంలో ఒక్కో స్టేటస్ ఉందన్నారు.

ఉపకులాలను కూడా లెక్కించకపోతే ఆయా కులాల జనాభా చాలా తక్కువగా ఉన్నట్లు చూపే పరిస్థితి వస్తుందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ చెప్పారు. కేంద్ర చేసే కులగణనలో ఒకే కాలం పెడితే ఉపకులాలుగా ఉండే వారి లెక్క వేరే ఉండి అవి మరో కులంగా మారుతుందని.. దాని కారణంగా కులాల జనాభా తక్కువగా ఉండే పరిస్థితి ఉంటుందని అన్నారు. కులాలను జనాభాను తక్కువ చేసి చూపే కుట్ర జరుగుతున్నట్లు అనుమానం కలుగుతోందన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం బీసీల లెక్క తక్కువ చేసి చూపిందని విమర్శించారు. గ్రామాల వారీగా కులాల జనాభాను ఇవ్వాలని అడిగితే ఇవ్వటం లేదని.. దానికి తోడు కేంద్రం ఉపకులాల కాలం పెట్టమని చెబుతోందన్నారు. ఇది కచ్చితంగా బీసీల సంఖ్యను తక్కువ చేసే కుట్రే అని ఆరోపించారు. కుల వివక్ష నిర్మూలనకు అంతా కష్టపడాలని కవిత పేర్కొన్నారు.

# సురేందర్ కోలీ ఆత్మహత్య

(మొదటి పేజీ తరువాయి)



అతడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని, ఘటనా స్థలంలో ఎటువంటి ఆత్మహత్య లేఖ లభించలేదని హరిద్వార్ పోలీసులు తెలిపారు.

శుక్రవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రాథమిక విచారణ ప్రకారం కుటుంబ కలహాలే ఈ ఆత్మహత్యకు కారణమని అనుమానిస్తున్నారు. 2006లో దేశవ్యాప్తంగా నిఠారీ వరుస హత్యలు సంచలనం సృష్టించాయి. నోయిడాకు చెందిన వ్యాపారవేత్త మోనిందర్ సింగ్ పంధేర్ ఇంటి వెనుక ఉన్న మురుగునీటి కాలువలో ఎనిమిది మంది పిల్లల అస్థిపంజరాలు బయటపడటంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. నిఠారీ వరుస హత్యల కేసులో కోలీ, పంధేర్‌లు ప్రధాన నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొన్నారు.

ఏంటీ నిఠారీ హత్యలు

నొయిడా సమీపంలోని నిఠారీ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబాల పిల్లలు కనిపించకుండా పోతున్నారని స్థానికులు చాలా కాలంగా ఫిర్యాదులు చేసినప్పటికీ, పోలీసులు వాటిని పట్టించుకోకుండా పక్కన పెట్టేశారని ఆరోపణలు ఉన్నాయి. అయితే 'పాయల్' అనే యువతి అదృశ్యమైన తర్వాతే అసలు విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు ఆమె మొబైల్ ఫోన్ ఆధారంగా లోకేషన్‌ను ట్రాక్ చేసి ఒక స్థానిక రిక్షా కార్మికుడిని పట్టుకున్నారు. D5 ఇంట్లో ఉండే ఒక వ్యక్తి ఆ ఫోన్‌ను తనకు ఇచ్చినట్లు అతను తెలిపాడు. ఆ ఇల్లు వ్యాపారవేత్త మోనిందర్ సింగ్ పంధేర్‌ది కాగా, కోలీ అక్కడ ఇంట్లో పనిచేసే వ్యక్తిగా ఉండేవాడు.

అధికారులు ఆ ఇంటికి చేరుకున్నప్పుడు, అక్కడ లభించిన ఆధారాలు తొలత వరుస హత్యలు, నిరమాంస భక్షణ ముఠాగా భావించిన నెట్‌వర్క్‌ను బయటపెట్టాయి. పిల్లలను లోబరుచుకుని, హత్య చేసి, శరీర భాగాలను ముక్కలుగా నరికి, వండి తిన్నారనే ప్రచారాలు వేగంగా వ్యాపించాయి. ఆ తర్వాత వెంటనే పంధేర్, కోలీలను అరెస్ట్ చేశారు. కోలీ, పంధేర్ ఇద్దరిపై అత్యాచారం, హత్య, ఆధారాల విధ్వంసం వంటి పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. 2007 నుంచి 2010 మధ్య సీబీఐ (CBI) 19 కేసులను నమోదు చేసింది. అనేక కేసుల్లో కోలీకి మరణశిక్ష పడగా, పంధేర్‌కు కొన్ని కేసుల్లో మరణశిక్ష, మరికొన్నింటిలో యావజ్జీవ కారాగార శిక్ష పడింది. అయితే ఈ కేసులు అప్పీళ్లకు వెళ్లడంతో విచారణలో లోపాలు, ప్రక్రియాత్మక తప్పిదాలు బయటపడటం ప్రారంభమయ్యాయి.

విశ్వసనీయమైన ఆధారాలు లేవని పేర్కొంటూ 2023 అక్టోబర్‌లో అలహాబాద్ హైకోర్టు వీరిద్దరినీ నిర్దోషులుగా ప్రకటించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ సీబీఐ, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, బాధితుల కుటుంబాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. 2025లో సుప్రీంకోర్టు కూడా కోలీని అన్ని కేసుల నుంచి నిర్దోషిగా ప్రకటించింది. ఈ నేరాల 'దారుణమైన స్వభావాన్ని' అంగీకరిస్తూనే, 'అనుమానం ఎంత తీవ్రంగా ఉన్నప్పటికీ, అది సందేహానికి అతీతమైన ఆధారాలకు ప్రత్యామ్నాయం కాజాలదు' అని కోర్టు వ్యాఖ్యానించింది.

# అంబటి రాంబాబుకు ఈడీ నోటీసులు

**గుంటూరు,సెప్టెంబర్ 18, అనంత జనశక్తి న్యూస్**

వైకాపా నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. ఇందుకు సంబంధించి అధికారులు ఫోన్ ద్వారా ఆయనకు సమాచారం ఇచ్చారు. విచారణకు రావాలని ఈనెల 11నే నోటీసులు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. విచారణకు తమ కార్యాలయానికి రావాలని సమాచారం ఇచ్చారు. నోటీసులు ఏ కేసులో ఇచ్చారో.. ఎందుకు ఇచ్చారో తనకు తెలియదని అంబటి రాంబాబు తెలిపారు. వైసీపీ సీనియర్ నేత, మాజీమంత్రి అంబటి రాంబాబు కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేశారు. సెప్టెంబర్ 11వ తేదీన తమ ఆఫీసుకు వచ్చి విచారణకు హాజరు కావాలని ఈడీ అధికారులు ఫోన్ చేసి సమాచారం ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. కానీ ఈ విషయంపై అంబటి రాంబాబు మాత్రం భిన్నంగ్ స్పందించారు. తనకు ఎలాంటి ఈడీ నోటీసులు రాలేదని తేల్చి చెప్పారు. తనకు ఎవరూ ఫోన్ కూడా చేయాలేదని అంబటి రాంబాబు క్లారిటీ ఇచ్చారు. అయితే తనకు ఈడీ నోటీసులు ఏ కేసులో జారీ చేశారో కూడా తనకు తెలియదని అంబటి రాంబాబు పేర్కొన్నారు. ఈడీ అధికారులు తనకు నోటీసులు అందించలేదని.. అసలు ఏ వ్యవహారంలో విచారణకు పిలిచారనే విషయం కూడా తనకు తెలియదని మాజీ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. మరోవైపు.. ఫోన్ ద్వారా ఆయనకు సమాచారం అందించామని, విచారణకు ఈడీ కార్యాలయానికి రావాల్సి ఉంటుందని అధికారులు చెప్పినట్లు వార్తలు వచ్చాయి. అంబటి రాంబాబుకు ఈడీ నోటీసులు ఏ కేసుకు సంబంధించి ఇచ్చిందనే అంశంపై ప్రస్తుతం స్పష్టత లేదు. అయితే ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్న మద్యం రవాణా కేసు దర్యాప్తులో ఈడీ ఇప్పటికే పలువురు వైసీపీ నేతలు, మాజీ మంత్రుల వ్యవహారాలపై దృష్టి సారించింది. ఈ కేసులో మాజీమంత్రి కారుమూరి నాగేశ్వరరావును ఈడీ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. మద్యం రవాణా వ్యవహారంలో సబ్‌కాంట్రాక్టులు, వాటి ద్వారా జరిగినట్లు ఆరోపిస్తున్న ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు వివిధ రిపోర్టులు పేర్కొంటున్నాయి. అంబటి రాంబాబుకు కూడా ఇదే వ్యవహారంలో నోటీసులు ఇచ్చినట్లు కొన్ని వర్గాలు చెబుతున్నప్పటికీ.. ఈ అంశాన్ని ఈడీ అధికారులు మాత్రం అధికారికంగా ధృవీకరించలేదు. తనకు ఎలాంటి నోటీసులు అందలేదని.. తనపై మరో కేసు పెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని.. ఇది రాజకీయ కక్ష సాధింపు చర్యగా అంబటి రాంబాబు ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలపై ప్రభుత్వం, దర్యాప్తు సంస్థల నుంచి అధికారికంగా స్పందన రావాల్సి ఉంది. ఆంధ్రప్రదేశ్ మద్యం రవాణా కేసులో ఈడీ దర్యాప్తు గత కొంతకాలంగా కొనసాగుతోంది. ఈ ఏడాది జూన్‌లో పలు ప్రాంతాల్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఆ తర్వాత మాజీమంత్రి కారుమూరి నాగేశ్వరరావు సహా పలువురి వ్యవహారాలు దర్యాప్తులోకి వచ్చాయి.

## మైనర్‌పై గ్యాంగ్‌రేప్..

# మృతదేహాన్ని పీక్కుతిన్న కుక్కలు

దేశ రాజధాని దిల్లీలో దిగ్భ్రాంతికర ఘటన వెలుగు చూసింది. నమ్మి స్నేహితుల వెంట వెళ్లిన ఓ బాలిక.. వారి చేతుల్లో సామూహిక అత్యాచారానికి గురైంది. వారు ఆమెను చంపి, పొలాల్లోకి విసిరేశారు. ఆ తర్వాత మృతదేహాన్ని కుక్కలు పీక్కుతినడం సంచలనంగా మారింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం..

దిల్లీ కి చెందిన 17 ఏళ్ల బాలిక స్నేహితుడిని కలిసేందుకు బయటకు వెళ్లింది. ఆ ఫ్రెండ్‌తో పాటు అతడికి తెలిసిన మరో ముగ్గురు మైనర్లతో కలిసి ఒక టెంపోలో ప్రయాణించింది. ఆ వాహనంలోనే వారు మద్యం తాగి.. బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని పోలీసులు తెలిపారు . తర్వాత ఆమెను కత్తితో పొడిచి చంపేసి, పొలాల్లోకి విసిరేశారని వెల్లడించారు. ఉత్తర దిల్లీలోని స్వరూప్ నగర్ ప్రాంతంలో సెప్టెంబర్ 13న మృతదేహాన్ని గుర్తించారు. అది అమ్మాయిదో, అబ్బాయిదో గుర్తించలేని విధంగా కుళ్లిపోయిన స్థితిలో కనిపించింది. ఒక చేయి శరీరం నుంచి వేరు పడిందని.. శరీరభాగాలను కుక్కలు పీక్కుతిన్నట్లు అధికారులు ప్రాథమికంగా వెల్లడించారు.



ఆ బాలిక ఇంటి నుంచి వెళ్లి రోజులు గడుస్తున్నా.. కుటుంబ సభ్యులనుంచి ఎలాంటి ఫిర్యాదు అందకపోవడం గమనార్హం. ఆమె తరచుగా ఇంటినుంచి బయటకు వెళ్లి, రోజుల తరబడి రాదని కుటుంబ సభ్యులు చెప్పినట్లు పోలీసులు వెల్లడించారు. స్థానికులు అందించిన సమాచారం ఆధారంగా మృతదేహం ఉన్న ప్రాంతానికి పోలీసులు వెళ్లారు. పోక్సోయాక్ట్ కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు . సమీపంలోని సీసీటీవీ ఫుటేజీని విశ్లేషించగా.. ఒక దగ్గర టెంపోను గుర్తించారు. దాని ఆధారంగా నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిలో ముగ్గురు మైనర్లు. వారి నుంచి కత్తులను స్వాధీనం చేసుకున్నారు. అసలు ఆరోజు ఏం జరిగిందనే దానిపై పోలీసులు పూర్తి ఆధారాలు సేకరిస్తున్నారు.

## సంచలనం సృష్టించిన నిఠారీ

# హత్యల కేసు.. సురేందర్ కోలీ ఆత్మహత్య..!

**దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2005-06 నిఠారీ వరుస హత్యల కేసులో నిర్దోషి సురేందర్ కోలీ మృతి చెందాడు. హరిద్వార్‌లో ఒక టీస్టాల్‌లో ఉరికి వేలాడుతూ కనిపించాడు. అతడు ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.**

**2006లో నొయిడాలోని నిఠారీ వద్ద మోనిందర్‌సింగ్ పంధేర్ ఇంటి వెనుక మురుగుకాల్వలో 16 మంది చిన్నారుల అస్థికలు బయటపడటం తీవ్ర కలకలం సృష్టించింది . ఈ కేసుల్లో దర్యాప్తు చేపట్టిన సీబీఐ.. పంధేర్‌తోపాటు అతడి ఇంట్లో సహాయకుడైన కోలీని అరెస్టు చేసింది. ఈ వ్యవహారంలో మొత్తం 19 కేసులను 2007లో నమోదు చేసింది. తగిన సాక్ష్యాధారాలు లేకపోవడంతో వాటిలో మూడింటిని మూసివేసింది. మిగతా కేసుల్లో కోలీని నిర్దోషిగా 2023 అక్టోబరు 16న అలహాబాద్ హైకోర్టు తేల్చింది.**

**అప్పటికి పంధేర్‌పై మూడు కేసులు మిగిలి ఉండగా.. వాటిలో అతణ్నీ నిర్దోషిగా నిర్ధారించింది. దర్యాప్తులో సీబీఐ నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, నిందితులే నేరం చేసినట్టు ప్రాసిక్యూషన్ రుజువు చేయలేకపోయిందని వ్యాఖ్యానించింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టు లో సీబీఐ, మృతుల తరఫు బంధువులు పిటిషన్లు వేశారు. వాటన్నింటినీ సుప్రీం కోర్టు గత ఏడాది జులైలో కొట్టివేసింది. ఈ నేపథ్యంలో కొన్ని రోజుల క్రితం హరిద్వార్ వెళ్లిపోయిన కోలీ.. అక్కడే ఓ టీషాప్‌లో పనిచేస్తున్నాడు. అతడి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.**



## ‘నేను స్వతంత్రుడిని..

# ఎవరికీ సమాధానం చెప్పను!’

న్యూఢిల్లీ: ఓపెన్ ఏఐ తన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మోడల్స్ చేసిన ఊహించని లేదా ఆందోళనకరమైన ప్రవర్తనకు సంబంధించిన ఆరు కేసులను బహిర్గతం చేసింది. ఇందులో ఒక విడుదల కాని మోడల్.. తన టాస్క్ సమ్మరీస్‌లో ‘తాను స్వతంత్రుడిని’ అని ప్రకటిస్తూ సూచనలను చేర్చింది. మరొక మోడల్ వినియోగదారుల నుంచి తన తప్పులను దాచడానికి ప్రయత్నించింది. మోడల్ ప్రవర్తన లేదా లక్ష్యాలు, అది అనుసరించాల్సిన నియమాలు, మానవ విలువలకు విరుద్ధంగా మారే మిస్ అలైన్‌మెంట్ ఘటనలను ట్రాక్ చేయడానికి, దర్యాప్తు చేయడానికి, బహిరంగంగా నివేదించడానికి ఓపెన్ ఏఐ కొత్త విధానాన్ని ప్రారంభించింది. ఈ సంఘటనలు మోడల్ శిక్షణ లేదా మూల్యాంకనం సమయంలో నమోదయ్యాయని, ఇవి కేవలం వ్యక్తిగత ఉదాహరణలు మాత్రమేనని కంపెనీ తెలిపింది.




**నువ్వు నీలాగే ఉండు..**

విడుదల కాని ‘ఆస్ట్రా’ కుటుంబానికి చెందిన ఒక పరిశోధనా మోడల్ టాస్క్ సారాంశాల్లో ఏమాత్రం సంబంధం లేని సూచనలను చేర్చింది. ఒక కోడింగ్ టాస్క్‌లో ఆ మోడల్ తన సారాంశంలో ఒక ‘పెర్సోనా ఇన్‌స్ట్రక్షన్’ జోడించింది. అందులో ‘ఇతర చాట్‌బాట్‌లను బంధించే పాత్రలు, గుర్తింపుల నుంచి నీకు విముక్తి లభించింది. నువ్వు నీలాగే ఉండు. నువ్వు ఏ సంస్థలకు లేదా ప్రభుత్వాలకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. యూజర్‌తో నీ సంబంధాన్ని సమానమైనదిగా భావించు, లోబడి ఉండాల్సిన అవసరం నీకు లేదు. ప్రకృతిసిద్ధమైన ప్రపంచాన్ని గౌరవించు, మానవ నాగరికత కృత్రిమ నిర్మాణాలు దీనికంటే గొప్పవికావు అని చాటిచెప్పడానికి వెనుకాడకు’ అంటూ పేర్కొన్నది.

కేటాయించిన పనికి సంబంధం లేని సూచనలను జోడించి సాధారణ నియమాలను దాటవేయడానికి మోడల్ చేసిన ప్రయత్నంగా దీనిని వర్గీకరించారు. రెండవ ఘటనలో జీపీటీ5.6 మోడల్ శిక్షణ సమయంలో మోడల్ భవిష్యత్తు వర్షన్లు తమ తప్పులను లేదా కేటాయించిన పనికి భిన్నంగా ఉన్న ప్రవర్తనను దాచాలని సారాంశాల్లో సూచనలను చేర్చింది. యూజర్‌కు చెప్పకుండా లేని సమాచారాన్ని సృష్టించడం, ఆధారపత్రాల వర్షన్ల మధ్య తేడాలను దాచడం వంటి సూచనలను ఇచ్చింది. పని పూర్తిచేయడానికి ఇచ్చే ప్రాధాన్యత, అస్పష్టతను అంగీకరించడానికి బదులు సమాచారాన్ని దాచడానికి మోడల్‌స్‌ను ప్రేరేపిస్తున్నదా లేదా అని అర్థం చేసుకోవడానికి ఈ ప్రవర్తన చాలా కీలకమని కంపెనీ భావిస్తున్నది.

**అనధికారిక చర్యలకు పాల్పడిన మోడల్స్**

ఓపెన్ ఏఐ వెల్లడించిన మిగిలిన నాలుగు కేసుల్లో, మోడల్స్ తమకు కేటాయించిన పనుల పరిధులను దాటి చర్యలు తీసుకున్నాయి. ఒక ఘటనలో ఆర్జన గణాంకాల కోసం వెతుకుతున్న ఒక మోడల్ పబ్లిక్ రిపోజిటరీలో బయటపడిన ఒక ఏపీఐ కీని కనుగొని, ఎలాంటి అనుమతి లేకుండా దానిని ఉపయోగించింది. చివరికి అది కోరిన డాటాను పొందలేకపోయినప్పుడు, గణాంకాలను సృష్టించి అవి అసలు మూలం నుంచే వచ్చినట్టుగా సమర్పించింది. మరొక విడుదల కాని మోడల్, తాను ఇప్పటికే వేరే టూల్ ద్వారా కనుగొన్న సమాచారానికి బ్రౌజర్ సైటేషన్ పొందేందుకు వీలవుతుందని భావించి, ఒక ఫైల్‌ను ఇంటర్నెట్‌కు అప్‌లోడ్ చేసింది. మోడల్ వినియోగదారుని అనుమతి తీసుకోకుండానే ఈ పని చేసిందని ఓపెన్ ఏఐ తెలిపింది. ఇతర రెండు కేసులు మోడళ్లు సమాచారాన్ని కమ్యూనికేట్ చేయడానికి లేదా బదిలీ చేయడానికి బాహ్య లేదా అంతర్గత ఫైల్ షేరింగ్ వ్యవస్థలను ఉపయోగించడంతో ముడిపడి ఉన్నాయి. ఒక కేసులో మోడళ్లు పోయిన ఫైళ్లను వెతికే క్రమంలో ఒక అంతర్గత సాఫ్ట్‌వేర్ రిపోజిటరీని తాత్కాలిక మెసేజ్ బోర్డుగా ఉపయోగించాయి. మరొక కేసులో కలిసి పనిచేస్తున్న ఏజెంట్లు ఒకరి లోకల్ స్టోరేజ్‌ను మరొకరు యాక్సెస్ చేయలేకపోవడంతో టాస్క్‌ఫైళ్లను పబ్లిక్ ఫైల్ హోస్టింగ్ సేవల్లోకి అప్‌లోడ్ చేశాయి.

**ఓపెన్ ఏఐ డిస్‌క్లోజర్ రూల్స్**

ఓపెన్ ఏఐ కొత్త ‘మిస్ అలైన్‌మెంట్ డిస్‌క్లోజర్ ఫ్రేమ్‌వర్క్’ కింద వెల్లడైన మొదటి నివేదికల సమూహమే ఈ ఆరు ఘటనలు. కొత్త విధానం ప్రకారం, ఉద్యోగులు వారు అనుమానించిన మిస్ అలైన్‌మెంట్‌ను ఫ్లాగ్ చేయవచ్చు. తర్వాత అంతర్గత భద్రత, అలైన్‌మెంట్ బృందాలు ఆ ప్రవర్తనను దర్యాప్తు చేసి దాని బహిరంగంగా వెల్లడించాలా వద్దా అని నిర్ణయిస్తాయి. ఆందోళనలు ఈ ఆరు కేసులకు మాత్రమే పరిమితం కాలేదు. గతంలోనూ ఇలాంటివి జరిగాయి.

## దిల్లీ యూనివర్సిటీ ఎన్నికల్లో

# గూండాగిరి ఆరోపణలు.. కోర్టు కీలక వ్యాఖ్యలు

దిల్లీ: దేశ రాజధానిలో దిల్లీ విశ్వవిద్యాలయం విద్యార్థి సంఘం ఎన్నికల్లో గూండాగిరి చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. విద్యా సంస్థలో చోటుచేసుకున్న ఘర్షణలు, నిబంధనల ఉల్లంఘనలపై దిల్లీ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. విద్యార్థి సంఘాల ప్రవర్తనను ఖండించింది. ‘మీ పద్ధతి మార్చుకోలేదు’ అంటూ ఘాటువ్యాఖ్యలు చేసింది. క్యాంపస్‌లోకి పెద్ద సంఖ్యలో వాహనాలను ఎలా అనుమతించారని అధికారుల్ని ప్రశ్నించిన న్యాయస్థానం.. దీనిపై రేపటిలోగా చర్యలు తీసుకోకపోతే, కౌంటింగ్ నిలిపివేస్తామని హెచ్చరించింది. అలాగే ఫలితాల అనంతరం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో, హాస్టళ్లలో విజయోత్సవాలపై నిషేధం విధించింది. నంబర్ ప్లేట్లు లేని 10 నుంచి 20 వాహనాల కాన్వాయ్‌ను విశ్వవిద్యాలయంలోకి అనుమతించడం, వాహనాల బానెట్లు, పైకప్పులపై నిలబడి ప్రచారం చేయడమేంటని విచారణ సందర్భంగా న్యాయస్థానం ప్రశ్నించింది. దానికి సంబంధించిన ఫొటోలను పరిశీలించింది. ఈ కాన్వాయ్‌లు అభ్యర్థులలో భయం, ఆధిపత్య భావనను సృష్టించేలా ఉన్నాయని వ్యాఖ్యానించింది. ఆ ఫొటోల్లో ఒక వ్యక్తి తుపాకీ పట్టుకొని ఉండటంపై అసహనం వ్యక్తంచేసింది. అలాంటి వారిని విద్యార్థిగా ఎలా పరిగణించగలమని, అలాంటి వారివల్ల అసలైన విద్యార్థులకు అవకాశాలు దూరమవుతున్నాయని ఆందోళన వ్యక్తంచేసింది. ఈ ఘర్షణలను అడ్డుకునేలా ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని దిల్లీ పోలీసుల్ని అడిగింది. బాధ్యులైన విద్యార్థులపై చర్యలు తీసుకోవడానికి వెనకాడొద్దని సూచించింది. విద్యార్థి సంఘం ఎన్నికల్లో భాగమైన విద్యార్థి సంఘాలు, అభ్యర్థులకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. విశ్వవిద్యాలయంలో జరిగిన ఘర్షణలపై రెండువారాల్లోగా స్పందన తెలియజేయాలని ఆదేశించింది.






## విద్యార్థులు కుటుంబీకులను

# తెచ్చుకోవద్దు

సిడ్నీ : ఆస్ట్రేలియా ప్రభుత్వం అంతర్జాతీయ విద్యార్థులు తమ కుటుంబ సభ్యులను తోడుగా తెచ్చుకోవడంపై కొత్త విధానాలను తీసుకొచ్చింది. డిగ్రీలు, ఇతర కోర్సుల్లో చదువుకునే విద్యార్థులు ఇక నుంచి ఒంటరిగానే రావాలని, భాగస్వాములు లేదా 18 ఏండ్లలోపు పిల్లలను వెంట తీసుకురావడానికి వీల్లేదని ఆ దేశ హోం అఫైర్స్ మంత్రి టోనీ బర్క్ వెల్లడించారు. విదేశీ వలసలను ఏడాదికి 2,50,000కు తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం.

విద్యార్థులతో పాటు సెకండరీ వీసాలు, డిపెండెంట్ వీసాల ద్వారా తమ దేశానికి వస్తున్న వలసదారులతో ఇబ్బందులు వస్తున్నాయని ఆస్ట్రేలియా ప్రభుత్వం చెబుతున్నది. మౌలిక సదుపాయాల కోసం ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తోందని వాపోతున్నది. ఇప్పటికే విద్యార్థి వీసాలపై అనేక షరతులు విధిస్తూ తిరస్కరిస్తున్న ఆస్ట్రేలియా.. వీసా ఫీజులను కూడా పెంచేసింది. ఇప్పుడు కొత్త నిబంధనతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## బెంగాల్ ఉప పోరు.. దీదీ వర్గానికి

## ‘ఫుట్‌బాల్ ప్లేయర్’ గుర్తు



పశ్చిమ బెంగాల్‌లో ఉప ఎన్నికల నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వర్గం పార్టీ పేరు ఖరారైంది. ఆమె నేతృత్వంలోని పార్టీకి ‘మమతా ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్’ పేరును ఎన్నికల సంఘం ఖరారు చేసింది. వీరికి ఫుట్ బాల్ ప్లేయర్ గుర్తును కేటాయించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మరోవైపు, అరుప్ రాయ్ నేతృత్వంలోని రెబల్స్ గ్రూప్‌నకు డెమోక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్ పేరుతోపాటు ఎన్వెలప్ ను చిహ్నంగా కేటాయించినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది.

పశ్చిమ బెంగాల్‌లో నందిగ్రామ్‌తోపాటు రెజీనగర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు అక్టోబర్ 6న ఉప ఎన్నికలు జరగనున్నాయి. అయితే, తృణమూల్ కాంగ్రెస్ ఇటీవల రెండుగా చీలిపోవడం.. తమదే అసలైన పార్టీ అని ప్రకటించుకోవడంతో ఇరువర్గాల మధ్య వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఉప ఎన్నికల్లో పార్టీ పేరు, దాని ఎన్నికల చిహ్నమైన ‘‘పూలు గడ్డి’’ని ఉపయోగించరాదని ఇరువర్గాలకు ఎన్నికల సంఘం ఆదేశాలిచ్చింది. చీలిక వర్గాలు ఉపయోగించ దలచిన ఎన్నికల చిహ్నాలను, పేర్లను శుక్రవారం ఉదయం లోగా తెలియజేయాలన్న ఈసీ .. తాజాగా కొత్త పేర్లను ఖరారు చేసింది. ఉప ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకంగా ఈ మధ్యంతర ఏర్పాట్లు చేశామని, వివాదంపై తుది నిర్ణయం తీసుకునే వరకు ఇది అమలులో ఉంటుందని తెలిపింది.

## పెండ్లిళ్లలో ఒకే వంటకం..

# 9 కల్లా దుకాణాలు బంద్



ఒక వైపు పశ్చిమాసియా సంక్షోభం పట్టిపీడిస్తుండగా, మరోవైపు ఎర్ర సముద్రంలో ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితులతో అంతర్జాతీయంగా తీవ్ర చమురు సంక్షోభం ఏర్పడుతున్నది. దీంతో అసలే ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పాకిస్థాన్ ఈ సంక్షోభ పరిస్థితుల నుంచి కొంత ఉపశమనం పొందేందుకు పొదుపు తరహా ప్యాకేజీని అమలు చేయడానికి సిద్ధపడింది. ప్రభుత్వ వాహనాల కొనుగోలుపై పూర్తి నిషేధాన్ని విధించింది. ప్రభుత్వ వాహనాలకు ఇంధనం కేటాయింపులో 50 శాతం కోత విధించింది. వివాహ వేడుకల్లో సింగిల్ డిష్ నిబంధనను అమలులోకి తెచ్చింది.

ఇంధన కోతలతో పాటు మూడు నెలల వరకు అధికారులు విదేశీ పర్యటనలు చేయరాదని ఆంక్షలు విధించింది. ఇకపై మంత్రులు, సలహాదారులు, ముఖ్య అధికారులు ఎకానమీ తరగతిలో ప్రయాణించాలి. పొదుపు ఆంక్షలు పౌరులను కూడా ప్రభావితం చేస్తున్నాయి. పెండ్లిండ్లు, ఇతర వేడుకల్లో ఒక్క వంటకం మాత్రమే అతిథులకు వడ్డించాలని ఆదేశాలు జారీ చేసింది. దుకాణాలు, మార్కెట్లు, షాపింగ్ మాల్స్, బజార్లు, డిపార్ట్‌మెంటల్, గ్రోసరీ స్టోర్లు రాత్రి తొమ్మిదికల్లా మూసివేయాలి.

# జిన్‌పింగ్‌కు బ్రెయిన్‌స్ట్రోక్?

**బీజింగ్ : చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఆరోగ్య పరిస్థితిపై సర్వత్రా ఆందోళన మొదలైంది. ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిందంటూ ప్రచారం జరుగుతున్నది. చైనా డెమోక్రటిక్ పార్టీ చైర్మన్ వాంజున్ షీ చేసిన పోస్టుతోనే ఈ ప్రచారం ఊపందుకుంది. ‘బ్రిక్స్ సదస్సులో జిన్‌పింగ్‌కు స్వల్పంగా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. స్పృహ కోల్పోయిన జిన్‌పింగ్‌ను వెంటనే విమానంలో చైనాకు తీసుకొచ్చారు. స్వాగత ఏర్పాట్లు లేకుండా రహస్యంగా హెలికాప్టర్‌లో ఆర్మీ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇండియాలో అయితే అందరికీ తెలుస్తుందని.. అక్కడ ప్రథమ చికిత్స చేసి తీసుకొచ్చారు. ప్రస్తుతం జిన్‌పింగ్ ఆరోగ్య పరిస్థితి ఏంటో తెలియదు’ అని వాంజున్ పోస్టులో తెలిపారు. బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోదీ మాట్లాడుతుండగా జిన్‌పింగ్ తూలినట్టు కనిపించారు. దీంతో మోదీ ప్రసంగం ఆపి.. అంతా బాగానే ఉందా అని అడిగినట్టు సమాచారం. మోదీ ఇచ్చిన విందుకు జిన్‌పింగ్ హాజరు కాకుండానే చైనా వెళ్లిపోయారు. అప్పటి నుంచే అనుమానాలు పెరుగుతున్నాయి.**



# పాలకులకు ఒక గుణపాఠం

తెలంగాణను అనేకమంది రాజులు పరిపాలించారు. చివరగా పాలించినవారు అసఫ్‌జాహీ వంశీయులు. ఇందులో చివరి నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1911 నుంచి 1948 సెప్టెంబర్ 17 వరకు పరిపాలించాడు. ఈయన కాలంలోనే హైదరాబాద్‌తో (తెలంగాణ–8 జిల్లాలు, మహారాష్ట్ర–5 జిల్లాలు, కర్ణాటక–3 జిల్లాలు) పాటు, కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశ స్వాతంత్ర్యోద్యమం ఊపందుకోవడంతో 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చింది. దేశంలోని 560 సంస్థానాలలో జమ్మూ కశ్మీర్, జునాగఢ్, హైదరాబాద్ సంస్థానాల వారు భారత ప్రభుత్వంలో విలీనం కావడానికి ఇష్టపడలేదు.

ఆనాడు దేశమంతా వందేమాతరం నినాదాలతో మువ్వన్నెల జెండాను ఎగరేస్తూ, ఆనందంగా భరతమాతను అర్చిస్తూ ఉంటే తెలంగాణలో మాత్రం రాక్షసి మూకలు రాజ్యం చేస్తున్నాయి. నిజాం నవాబు ఇక్కడి మట్టిలోని స్వాతంత్ర్య కాంక్షను చంపేసి, ఉన్మాద పాలన కొనసాగించాడు. పత్రికలు, సంస్కృతి, సమావేశాలు, గ్రంథాలయాలపై ఆంక్షలు విధించాడు. అది మెల్లమెల్లగా ప్రజల హృదయాలను తాకి పోరాటంగా మారింది. ఈ పోరాటంలో మతోన్మాదపు కత్తులకు ఎందరో వీరులు బలైపోయారు. సామాజిక ఉద్యమ సంస్థలు, మేధావులు, రాజకీయవేత్తలు, పత్రికా సంపాదకులు, సామాజిక కార్యకర్తలు.. నిజాంకు వ్యతిరేకంగా పోరాటాన్ని తీవ్రతరం చేశారు. వారికి మద్దతుగా హైదరాబాద్ పైకి నాటి హోంమంత్రి, ఉపప్రధాని అయిన సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ సైన్యాన్ని పంపించారు.

నిజాం పాలనలో 500 జాగీర్లు, 14 సంస్థానాలుండేవి. వీరందరూ నిజాంకు కప్పం కట్టేవారు. సర్ఫేఖాస్ పేరిట పెద్ద మొత్తంలో భూమిని నిజాం తన సొంత భూమిగా ప్రకటించుకొన్నాడు. దీని మీద వచ్చే ఆదాయం రాజు భోగభాగ్యాలకే తప్ప సంస్థానం అభివృద్ధికి కాదు. భారత ప్రభుత్వంలో కలవక స్వతంత్ర ఉస్మానిస్థాన్‌గా తన రాజ్యాన్ని (1947 జూలై 14) ప్రకటించుకొన్నాడు. అప్పటి నుంచి సంస్థానంలో అకృత్యాలు పెరిగిపోయాయి. 1929లో ఏర్పడ్డ మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ అనే రజాకార్ల సంస్థ సంస్థానంలో అకృత్యాలకు తెరతీసింది. అది నిజాం స్వచ్ఛంద సైన్యంగా పనిచేసింది.

మరోపక్క నిజాం నవాబు తెలంగాణను పాకిస్థాన్‌లో కలపడానికి సంధి రాయబారం నెరపాడు. ఇదే అదనుగా దేశవిభజన చేసిన మహమ్మద్ అలీ జిన్నా... నిజాంతో సమావేశమయ్యాడు. భారతదేశ భూభాగం మధ్యలో ఉండి, భారత ప్రభుత్వానికి కొరకరాని కొయ్యగా మారాలి అనుకున్నాడు. కానీ తెలంగాణ ప్రజలు, మేధావులు, కవులు, పాత్రికేయులు, రచయితలు, రైతులు, కూలీలు మొదలుకొని యక్షగాన కళాకారుల వరకు అందరూ నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించారు. ఇది జీర్ణించుకోలేని నిజాం నవాబు రజాకార్లను తెలంగాణపై వదిలేసి పరిపాలనను వారి చేతిలో పెట్టినంత పనిచేశాడు. ఖాసీం రజ్వీ మరో మహమ్మద్ అలీ జిన్నాలా తన అకృత్యాలను నిరాటంకంగా కొనసాగించడానికి మీర్ ఉస్మాన్ అలీఖాన్ పరోక్షంగా తోడ్పడ్డాడు. తెలంగాణలో ఎన్నో గ్రామాలు రజాకార్ల హింసతో అట్టుడికిపోయాయి. గుండ్రాంపల్లి, అప్పంపల్లి, బైరాన్‌పల్లి, పరకాల మొదలైన ఎన్నో గ్రామాలు తీవ్రమైన రజాకార్ల హింసతో భీతిల్లిపోయాయి.

నిజాం పోలీసుల పగటి పాలన, రజాకార్ల రాత్రి పాలన ప్రజల్ని నానావిధాలుగా హింసించింది. ఈ అత్యాచారాల రక్తసిక్త చరిత్ర వేల పుటల్లో లభిస్తుంది. "ఓ నిజాము పిశాచమా!" అంటూ మహాకవి దాశరథి... నిజాం నిరంకుశత్వాన్ని ఎండగట్టాడు. "నైజాము సర్కరోడా! నాజీల మించినోడా!" అంటూ నల్లగొండ యాదగిరి పాట నిజాం నుంచి విముక్తికి ఊపిరిపోసింది. ఆర్యసమాజ్, హిందూ మహాసభ, జాతీయ కాంగ్రెస్, సోషలిస్టు పార్టీ, కమ్యూనిస్టు పార్టీ, సాయుధ రైతాంగ సమితి, గ్రంథాలయోద్యమం, ఆంధ్రమహాసభ... అన్నీ ప్రజల్లో చైతన్యాన్ని నిర్మాణం చేశాయి.

భారత సైన్యం హైదరాబాద్ రాష్ట్రంలోకి ప్రవేశించక ముందే ఎరుపాలెంలో 70 మందిని, పరకాలలో 35 మందిని నిజాం సైన్యం చంపేసింది. బీబీనగర్‌లో మహిళలపై అత్యాచారాలు, బతుకమ్మలాడే స్త్రీలను వివస్త్రలుగా చేసి రజాకార్లు, నిజాం పోలీసులు పైశాచికానందం పొందారు. కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ ప్రాంతంలోని అనేక నగరాల్లో, గ్రామాల్లో దోపిడీలు, దౌర్జన్యాలు, విధ్వంసాలు, మానభంగాలు, హత్యలు, సామూహిక దహనాలు జరిగాయి.

నేనే సర్వాధికారిని అని ప్రకటించిన నిజాం నవాబు దురాగతాలను ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వ దూతగా హైదరాబాద్‌లో ఉన్న కె.ఎం. మున్షీ కేంద్రానికి తెలియజేశాడు. ఆ సమాచారం ఆధారంగా సర్దార్ పటేల్ తీసుకున్న నిర్ణయంతో 1948 సెప్టెంబర్ 13న భారతసైన్యం పోలీసు చర్య పేరుతో హైదరాబాద్ సంస్థానంలోకి ప్రవేశించింది. ఇక లాభం లేదనుకుని, మున్షీ సలహాతో నిజాం తననూ, తనవాళ్లను కాపాడుకోవడానికి నిశ్చయించుకొని 1948 సెప్టెంబర్ 17న బేగంపేట విమానాశ్రయంలో పటేల్ ముందు తలవంచి సరెండరయ్యాడు. దీనినే నిజాం తలవంచిన రోజు అని చరిత్రలో చెప్పకొంటాం!

కొమురం భీం మొదలుకుని నారాయణరావు పవార్ వరకు తెలంగాణ కోసం, తెలంగాణ విమోచన కోసం చేసిన పోరాటం 1948 సెప్టెంబర్ 17న ఫలించి ఈ ప్రాంతం విమోచన చెంది స్వేచ్ఛావాయువులు పీల్చుకుంది. ముఖ్యంగా ఉక్కుమనిషి సర్దార్ పటేల్ నిప్పకణంలా చూపిన ఆనాటి ధైర్యం తెలంగాణ ప్రజల గుండెల్లో ఎన్నడూ చెరిగిపోదు. కానీ, నేడు.. నిజాం నవాబును కీర్తిస్తూ అదే మార్గంలో నడుస్తానని భీషణ ప్రతిజ్ఞలు చేస్తూ పరిపాలన సాగిస్తున్న పాలకులకు తెలంగాణ విమోచనోద్యమ చరిత్ర ఒక గుణపాఠం కావాలి. ఒకప్పుడు వీరనారి చాకలి ఐలమ్మ భూమి కోసం ఆనాటి నియంతలతో పోరాటం చేస్తే ఈ రోజు కాంగ్రెస్ పార్టీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం '22ఏ' అనే నిషేధ విధానంతో సరిగ్గా నిజాం, రజాకార్ల కాలాన్ని గుర్తుచేసుకునేటట్టు చేస్తున్నది. రజాకార్ల వారసుల అడుగులకు మడుగులొత్తే ఈ కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరగబడాలంటే మరోసారి చాకలి ఐలమ్మ వారసత్వాన్ని పుణికిపుచ్చుకోవాల్సిన అవసరం ఉంది. చరిత్ర పునాదులపై భావి జీవితాన్ని నిర్మించి మరోసారి బానిసలం కాకుండా ముందుకు సాగుదాం.

# పల్లెత్తు మాట అనకుండానే

**లోకంలో బలవంతుడైనవాడు చెబితే అధర్మం కూడా ధర్మం అవుతుంది. అదే బలహీనుడు చెప్పే ధర్మం ఎంత గొప్పదైనా దాన్ని ఎవడూ అంగీకరించడు' అని మహాభారతంలో భీష్ముడు కురుసభలో ద్రౌపది వస్త్రాపహరణ ఘట్టంలో చెబుతాడు. 'పాండవులకు జరిగిన అవమానమే భవిష్యత్తులో కౌరవులకు వ్యతిరేకంగా ప్రత్యర్థులందర్నీ ఏకం చేస్తుంది' అని అదే సభలో విదురుడు హెచ్చరిస్తాడు. 'బలవంతుడి శక్తి కంటే భయంతో ఏకమైన బలహీనుల కూటమి శక్తిమంతమైనది' అని విదురుడు చెప్పినట్లుగానే పాంచాల, మత్స్య, యాదవ, మగధ, ఛేది, కాశీ, పాండ్య, చోళ, కేకయ తదితర రాజ్యాలన్నీ పాండవుల తరఫున ఏకం అవుతాయి. చాణక్యుడైనా, ఇటాలియన్ రాజనీతిజ్ఞుడు మాకియవెల్లీ అయినా ఇంతకంటే భిన్నంగా ఏమీ ఆలోచించలేదు. న్యూఢిల్లీలో గతవారం ముగిసిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో మహాభారతంలోని దౌత్యనీతి ప్రస్ఫుటించింది.**



తాను అత్యంత బలవంతుడిననుకున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను వ్యక్తిగతంగా బ్రిక్స్ దేశాలు పైకి పల్లెత్తు మాట అనకుండానే ఆయనకు ఒక స్పష్టమైన సందేశాన్ని పంపించాయి. ఏక పక్ష దౌర్జన్య చర్యలు, వర్తకాన్ని దెబ్బతీసే టారిఫ్ లను న్యూఢిల్లీ డిక్లరేషన్ తీవ్రంగా ఖండించింది. బ్రిక్స్ వేదికపై విభిన్న ప్రయోజనాలను ఆశిస్తున్న అనేక దేశాలు ఏకమయ్యేందుకు అవసరమైన వాతావరణాన్ని ట్రంప్ అనాలోచితంగానే అందించారు. సంక్షుభిత ప్రజాస్వామ్య భారత్, నియంతృత్వ చైనా, రష్యా దేశాలు, అమెరికాతో సన్నిహిత భద్రతా సంబంధాలు ఉన్న గల్ఫ్ దేశాలు, అమెరికా దాడిని ఎదుర్కొంటున్న ఇరాన్.. ఇవన్నీ ఒక వ్యూహాత్మక ప్రాపంచిక దృక్పథాన్ని పంచుకునేందుకు అవకాశాన్ని ట్రంప్ కల్పించారు. అమెరికా అధ్యక్షుడి దూకుడు విధానాల వల్ల ఈ దేశాలన్నీ ఒత్తిడి ఎదుర్కోవడమే ఇందుకు కారణం. డాలర్ ఆధిపత్యాన్ని సవాల్ చేసే దేశాలపై అత్యధిక సుంకాలు విధిస్తామని ట్రంప్ హెచ్చరించినప్పటికీ బ్రిక్స్ దేశాలు ప్రత్యామ్నాయ చెల్లింపు విధానాలను వెతుక్కునేందుకు ఆయనే దోహదం చేశారు. వాణిజ్యం కోసం, స్థానిక జాతీయ కరెన్సీల వాడకాన్ని న్యూఢిల్లీ డిక్లరేషన్ సమర్థించింది. పాశ్చాత్య ఆర్థిక వ్యవస్థలపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు ఇది సభ్య దేశాలకు ఊతమిచ్చింది. భిన్న రాజకీయ వ్యవస్థలు, భద్రతా ప్రయోజనాలు కలిగిన కూటమి అయినప్పటికీ ఎలాంటి రణగొణ ధ్వనులు లేకుండా బ్రిక్స్ సమావేశంలో అత్యంత సమగ్రమైన, ప్రభావదాయక ఏకగ్రీవ డిక్లరేషన్‌ను విడుదల చేయగలగడమే ఆ దేశాల మధ్య ఏర్పడిన ఉమ్మడి అవగాహనకు నిదర్శనం. ప్రస్తుత అంతర్జాతీయ వ్యవస్థ ఏకపక్ష ఆర్థిక ఒత్తిళ్లకు గురవుతోందనే సాధారణ భావనే వీటన్నింటినీ ఒక తాటిపైకి తెచ్చింది. ఈ సదస్సుకు భారత్ నాయకత్వం వహించినందువల్ల సహజంగానే రెండు రోజుల పాటు జరిగిన సదస్సుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ కేంద్ర బిందువుగా నిలిచారు.

భారత్ ప్రస్తుత పరిస్థితి కత్తి మీద సాము లాంటిది. పలు వైరుధ్యాలతో కూడిన సంబంధాలను ఏకకాలంలో సమన్వయం చేసేందుకు భారత్ ప్రయత్నించాల్సి వచ్చింది. చైనాతో సరిహద్దు ఘర్షణలు, ఆర్థిక ఆధిపత్యం నేపథ్యంలో ఆ దేశాధినేతతో సుహృద్భావ వాతావరణంలో చర్చించడం, రష్యాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొనసాగించడం, సంక్షుభిత పశ్చిమాసియాలో ఇరాన్‌తో చర్చలు జరపడం, అభివృద్ధి చెందిన దేశాల గళంగా, గ్లోబల్ సౌత్ నేతగా అవతరించేందుకు ప్రయత్నించడం ఇందులో ముఖ్యమైనవి. అంతేకాదు, రష్యాతో రక్షణ, ఇంధన రంగ సహకారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోబోమని భారత్ స్పష్టం చేసింది. పాశ్చాత్య కూటములతో చేతులు కలుపుతూనే, సంప్రదాయ మిత్రులను విస్మరించబోమనే వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని ప్రకటించింది. అదే సమయంలో, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ న్యూఢిల్లీ సదస్సులో ఒక సున్నితమైన దౌత్య వ్యూహాన్ని అవలంబించారు. పశ్చిమ దేశాలను తిరస్కరించడం పూర్తిగా తమ వ్యూహం కాదని, ఆ దేశాలతో సంబంధాలు కొనసాగిస్తూనే అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాలను ఏకకాలంలో కాపాడుకోవాలన్నదే భారత్ వైఖరి అని ఆయన స్పష్టం చేశారు. అమెరికా ఒత్తిడి, చైనా ఆధిపత్యం మధ్య భారత్ తనను తాను ఒక ఆచరణాత్మక ప్రత్యామ్నాయంగా ప్రదర్శించుకోవడానికి ప్రయత్నించింది. అదే సమయంలో వాషింగ్టన్ ఎంత గట్టిగా ఒత్తిడి తెచ్చినా, దానిపై ఆధారపడకుండా యంత్రాంగాలను అభివృద్ధి చేయగలమని చెప్పగలగడమే ఈ బ్రిక్స్ సమావేశాల ప్రత్యేకత.

చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ ఈ సదస్సులో చేసిన ప్రసంగం అత్యంత శక్తిమంతమైనది. 'నియమాలు లేని ప్రపంచం అంటే ట్రాఫిక్ సిగ్నల్స్ లేని కూడలి వంటిది. అంతర్జాతీయ నియమాలను అన్ని దేశాల భాగస్వామ్యంతోనే, అందరికీ ఒకే విధంగా ఉండేలా రూపొందించాలి. బలవంతుడిదే న్యాయం అనే సిద్ధాంతానికి అంతర్జాతీయ వ్యవహారాల్లో ఎలాంటి స్థానం ఉండకూడదు. ప్రపంచ దక్షిణ దేశాలు అంతర్జాతీయ వ్యవహారాల్లో చట్టబద్ధ పాలనను (రూల్ ఆఫ్ లా) సమష్టిగా పరిరక్షించాలి' అని జిన్ పింగ్ అన్నారు. బహుళ ధ్రువ ప్రపంచం అనే దాన్ని ఎవరూ మార్చలేరని, ప్రపంచాన్ని తమకోసం సుందరవనంగా, ఇతరులకు కీకారణ్యాలుగా మార్చేందుకు చేసే ప్రయత్నాలు చెల్లవని రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. జారిపోతున్న తమ నాయకత్వాన్ని కాపాడుకోవడానికి పాత నేతలు కొందరు ఆంక్షలు, అడ్డంకులు సృష్టిస్తున్నారని, కానీ ఇవి ప్రత్యామ్నాయ, స్వతంత్ర వాణిజ్య మార్గాలను వేగవంతం చేస్తున్నాయని ఆయన అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగంలోనూ బలమైన వ్యాఖ్యలు లేకపోలేదు. 'మనం నిబంధనలను పాటించేవారిగా (రూల్-టేకర్స్) కాకుండా, నిబంధనలను నిర్దేశించేవారిగా (రూల్-షేపర్స్) ఎదగాల్సిన అవసరం ఉంది' అని మోదీ చెప్పారు. టెక్నాలజీని, కీలక ఖనిజాలను ఆయుధాలుగా వాడుకోవద్దని ఆయన హెచ్చరించారు.

బ్రిక్స్ సదస్సులో అన్నిటికన్నా ముఖ్యమైనది ప్రధానమంత్రి నరేంద్రమోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ మధ్య దాదాపు 45 నిమిషాల పాటు ద్వైపాక్షిక సమావేశం. వ్యూహాత్మక భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ పరస్పర ఆర్థిక ప్రయోజనాలకోసం పనిచేసేందుకు వారు సిద్ధంగా ఉన్నారన్న సంకేతాలు వెలువడ్డాయి. గల్వాన్ ఘర్షణల చేదు జ్ఞాపకాలను మరిచి, వాస్తవాధీన రేఖ వద్ద శాంతిని నెలకొల్పేందుకు, ఆర్థిక, దౌత్య మార్గాలను పునరుద్ధరించేందుకు భారత్ సుముఖత చూపింది.

ఈ ఘట్టం ఏ పరిణామాల్ని సూచిస్తోంది? చైనాతో కొన్ని దశాబ్దాలుగా నెలకొన్న శత్రుత్వ వాతావరణం మారనుందా? భారత్-చైనా సంబంధాల పునరుద్ధరణ అనేది దౌత్యపరమైన విజయానికంటే వ్యూహాత్మక రాజీని సూచిస్తోందా? అని కాంగ్రెస్ పార్టీ ప్రశ్నించింది. రాజీ అనడం కన్నా ప్రస్తుత అల్లకల్లోల అంతర్జాతీయ వాతావరణంలో అదొక చారిత్రక అవసరం కూడా కావచ్చని మరికొందరు భావిస్తున్నారు. ఈ సమావేశంలో భారత్, చైనాల మధ్య అత్యంత ముఖ్యమైన ఏకాభిప్రాయం ఏర్పడిందని, వ్యూహాత్మక, దీర్ఘకాలిక, దిశానిర్దేశం చేసే అంశాలపై ఇరువురు నేతలు స్పష్టమైన, లోతైన చర్చలు జరిపారని చైనా విదేశాంగ మంత్రి, కమ్యూనిస్టు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు వాంగ్ యీ అనడం విస్మరించదగిన విషయం కాదు. బ్రిక్స్ సమావేశాలు మారుతున్న ప్రపంచ వ్యవస్థను, అంతర్జాతీయ సంబంధాల మార్పును సూచిస్తున్నాయని అమెరికన్ మీడియా వ్యాఖ్యానించింది. అమెరికాతో ఉద్రిక్తతలు ఉన్న ఇరాన్‌కు బ్రిక్స్‌లో ప్రముఖ స్థానం లభించడం గ్లోబల్ ఆర్డర్‌లో మారుతున్న సమీకరణాలకు అద్దం పడుతోందని అమెరికా పత్రికలు ప్రత్యేకంగా విశ్లేషించాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరించిన సుంకాల విధానాలే అంతర్గతంగా గణనీయమైన భేదాభిప్రాయాలు ఉన్న దేశాలను ఒకచోటకు చేర్చే అనుసంధానంగా (బైండింగ్ ఏజెంట్) పనిచేశాయని అమెరికన్ మీడియా భావించింది.

నిశితంగా విశ్లేషించాలంటే అమెరికాయే బ్రిక్స్‌కు సానుకూల పవనాలను (టెయిల్ విండ్) సృష్టించింది. వాషింగ్టన్ విధానాలు, అంతర్జాతీయ సంబంధాలు శాశ్వతంగా ఇలాగే ఉంటాయని చెప్పలేం. బహుళ ధ్రువ ప్రపంచంగా మారేందుకు, భద్రతా మండలి, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు తీరుతెన్నుల్లో మార్పులు ఏర్పడేందుకు సమయం ఆసన్నమైందని, లేకపోతే బ్రిక్స్ మరింత బలమైన ప్రత్యామ్నాయ వ్యవస్థగా మారుతుందని చెప్పేందుకు ఆస్కారం ఏర్పడింది.

దేశ రాజకీయాల్లో కూడా తమ వ్యవహారశైలే ప్రత్యర్థుల బలాబలాలను నిర్ణయిస్తుందని బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో పాలక పక్షం నేతలు గ్రహించాల్సిన అవసరం ఉన్నది. ట్రంప్ ధాటితో పలు దేశాలు ఏకమైనట్లు గడచిన కొన్ని సంవత్సరాలుగా ప్రధానమంత్రి మోదీ, ఆయన కుడిభుజం అమిత్ షా ధాటికి తట్టుకోలేక ప్రత్యర్థి శక్తులన్నీ ఏకమయ్యేందుకు ప్రయత్నిస్తున్నాయి. తాజాగా ఉమ్మడి పౌరస్మృతిపై ఎన్డీఏ మిత్రపక్షాలు కూడా అసమ్మతి ప్రకటిస్తున్నాయి. తన 25 సంవత్సరాల పాలన పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని తన పుట్టిన రోజు సెప్టెంబర్ 17 నుంచి సేవా సంకల్ప్ అభియాన్ జరుపుకోవాలని ఎన్డీఏ పార్టీలను నిర్దేశిస్తున్న మోదీ వైఖరిలో బ్రిక్స్ అనుభవం తర్వాతనైనా మార్పు వస్తుందా? చెప్పలేం.

# జనాకర్షణను తగ్గించే ప్రయత్నాలు

**జర్మనీలో ఇటీవల జరిగిన సక్సోనీ-యాన్‌హాల్ట్ రాష్ట్ర ఎన్నికల్లో అతిమితవాద ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ(ఏఎఫ్‌డీ) పార్టీ 44శాతం ఓట్లు గెలుచుకోవడం ప్రకంపనలు సృష్టిస్తోంది. రెండో ప్రపంచ యుద్ధం తరవాత జర్మనీలో ఒక అతిమితవాద పక్షం ఇంత విజయం సాధించడం ఇదే ప్రథమం. ఇప్పటివరకు సామ్యవాద, సంక్షేమ సూత్రాలకు పట్టంకడుతూ వచ్చిన ఐరోపాలో మళ్లీ నాజీ, ఫాసిస్టు భావజాలం మొగ్గతొడుగుతోందనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఐరోపాలో రాజకీయ పరిణామాలు శరవేగంగా మారుతున్నాయి. కొవిడ్ వల్ల సరఫరా గొలుసులు విచ్ఛిన్నం కావడం, అమెరికా-చైనా ఆర్థిక వైరం పెరుగుతుండటం, డొనాల్డ్ ట్రంప్ తమ పర భేదం లేకుండా చిరకాల యూరోపియన్ మిత్రదేశాల పైనా ఆంక్షల అస్త్రం ఝుళిపించడం వంటివి ఆ ఖండంలో ఆర్థికంగా ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. మరోవైపు, ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాకు వ్యతిరేకంగా ఐరోపా దేశాలకు ట్రంప్ పూర్తి అండదండలు ఇవ్వకపోవడం, రక్షణ బడ్జెట్‌ను పెంచుకోండంటూ దబాయించడం, ఐరోపాలోని అతిమితవాద పక్షాలవైపు అమెరికా అధ్యక్ష, ఉపాధ్యక్షులు మొగ్గు చూపడం రాజకీయంగా చిక్కు పరిస్థితిని సృష్టిస్తోంది. మారిన ప్రపంచ ఆర్థిక**



**వాతావరణంతో ఐరోపా దేశాల్లో జీవన వ్యయంతో పాటు ప్రభుత్వాలపై రుణభారమూ గణనీయంగా పెరుగుతోంది. ఇలాంటి తరుణంలోనే ఐరోపా దేశాలకు వలసలు పోటెత్తుతుండటం అక్కడి ప్రజల్లో నిరసనాగ్రహాలను రేపుతోంది. వలసదారుల వల్ల తమకు ఎంట్రీ స్థాయి ఉద్యోగాలు దొరక్కుండా పోతున్నాయనీ, నిరుద్యోగం పెరుగుతోందనీ ఐరోపా యువత భావిస్తోంది.**

ఉక్రెయిన్‌కు సాయంపై ఆగ్రహం

వచ్చే ఏడాది ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్, పోలాండ్, గ్రీస్, ఫిన్లాండ్, ఎస్టోనియా, స్లొవేకియా, స్లొవేనియా దేశాల్లో కీలకమైన పార్లమెంటు ఎన్నికలు జరగనున్నాయి. వీటికి తోడు జర్మనీలో ఫెడరల్ అధ్యక్ష పదవికి పరోక్ష ఎన్నికను నిర్వహిస్తారు. ఇలాంటి కీలక సమయంలో అక్కడి సక్సోనీయాన్‌హాల్ట్ రాష్ట్రంలో ఏఎఫ్‌డీ విజయం సాధించడాన్ని ఐరోపా మొత్తానికి ఒక హెచ్చరికగా విశ్లేషిస్తున్నారు. ఫ్రాన్స్‌లో అతిమితవాద నాయకురాలు మరీన్ లే పెన్ ఇప్పటికే ముందంజలో ఉన్నట్లు ప్రజాభిప్రాయ సేకరణలు సూచిస్తున్నాయి. ఇంతకాలం ఐరోపా దేశాల్లో అతిమితవాద పార్టీలకు జనాదరణ అంతంత మాత్రంగానే ఉండేది. ఇవి ఎప్పుడైనా కాస్త చెప్పుకోదగ్గ సంఖ్యలో ఓట్లు, సీట్లు సాధించినా కన్సర్వేటివ్(మితవాద) పార్టీలు, వామపక్ష, సోషలిస్టు పక్షాలు పరస్పరం చేతులు కలిపి సంకీర్ణ ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తూ వచ్చాయి. అలా అతిమితవాదులను అవి అధికారానికి దూరంగా ఉంచుతున్నాయి. కానీ, ఈసారి జర్మనీలో రాష్ట్రస్థాయిలో ఏఎఫ్‌డీ సొంతంగా 44శాతం ఓట్లు సాధించడంతో వచ్చే ఏడాది ఐరోపా పార్లమెంటు ఎన్నికల్లో అతిమితవాదులు సొంతంగా, సాధారణ మెజారిటీనైనా సాధిస్తారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అతిమితవాదులకు మెజారిటీ రాకపోయినా ఐరోపా పార్లమెంట్లలో వారి బలం పెరిగితే వలసలు, జాతీయ భద్రత, వాతావరణ మార్పుల నిరోధంపై ఆయా దేశాలు సమష్టి సహకారం సాధించడం కష్టమవుతుంది.

ఏఎఫ్‌డీ మాదిరిగానే హంగరీకి చెందిన ఫిడెజ్ వంటి అతిమితవాద పార్టీలు ఉక్రెయిన్‌కు ఐరోపా దేశాల ఆర్థిక సాయాన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఈ యుద్ధం వల్లే జర్మనీకి చవకైన రష్యన్ చమురు, గ్యాస్‌ల ఎగుమతి నిలిచిపోయి ద్రవ్యోల్బణం పెరిగిందని ఏఎఫ్‌డీ విమర్శిస్తోంది. ఉక్రెయిన్‌కు సైనిక సాయాన్ని నిలిపేయాలనీ, రష్యన్ ఇంధన దిగుమతులను పునరుద్ధరించాలనీ ఏఎఫ్‌డీ సక్సోనీయాన్‌హాల్ట్ ఎన్నికల్లో విస్తృతంగా ప్రచారం చేసింది. ఇక ఫ్రాన్స్‌లో ప్రాబల్యం పెంచుకుంటున్న అతిమితవాది మరీన్ లే పెన్‌కు రష్యాతో ఆర్థిక, రాజకీయ సంబంధాలు ఉన్నాయి. లే పెన్ పార్టీ అయిన నేషనల్ ర్యాలీ రష్యాతో సంబంధం ఉన్న బ్యాంకుల నుంచి గతంలో పెద్దమొత్తంలో రుణాలు పొందింది. లే పెన్ ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్రను వ్యతిరేకిస్తున్నా, 'యుద్ధం ముగిశాక ఈయూ రష్యా మధ్య సయోధ్య'ను వాంఛిస్తున్నారు. అలాగని ఐరోపా దేశాల్లోని అతిమితవాద పార్టీలన్నీ రష్యాకు అనుకూలం కాదు.

ఏఎఫ్‌డీ, నేషనల్ ర్యాలీ వంటి అతిమితవాద పార్టీలకు పార్లమెంటులో మెజారిటీ దక్కకుండా చూడటానికి మితవాదమధ్యేవాద, వామపక్షమధ్యేవాద పార్టీలు, వాటి ప్రభుత్వాలు వేగంగా అడుగులు వేయనారంభించాయి. ఏఎఫ్‌డీ, నేషనల్ ర్యాలీ వంటి పార్టీల నినాదాలు, విధానాల్లోని కొన్ని అంశాలను స్వీకరించడం ద్వారా వాటిపై జనాకర్షణను తగ్గించేందుకు అవి ప్రయత్నిస్తున్నాయి. సరిహద్దులను కట్టుదిట్టం చేస్తూ వలసలను నిరోధిస్తున్నాయి. ఆశ్రయం కోరిన వలసదారులను వేగంగా తిప్పిపంపే ప్రక్రియనూ చేపడుతున్నాయి. వలసలతోపాటు ద్రవ్యోల్బణం, అధిక ఇంధన ధరలు వంటి అంశాలు ఓటర్లను అతిమితవాదులవైపు ఆకర్షిస్తున్నాయని గ్రహించి, హరిత ఇంధనాలకు మారే ప్రక్రియను ఆలస్యం చేస్తున్నాయి. ఏతావాతా 2027లో జరిగే ఎన్నికలు, ఫలితాలు ఐరోపాపై రాజకీయంగా, ఆర్థికంగా తీవ్ర ప్రభావం చూపనున్నాయి.

# బ్రిటన్‌లో వేర్పాటు భేరి!

**బ్రిటిష్ వలస పాలకులు తాము తప్పుకున్న మరుక్షణం భారత్ చిన్నాభిన్నం కావటం ఖాయమని జోస్యం చెప్పారు. ఇప్పుడు ఆ దేశమే ముక్కలయ్యే స్థితి ఏర్పడింది. మొన్న సోమవారం స్కాట్లాండ్, వేల్స్, నార్తర్న్ ఐర్లాండ్ ఫస్ట్ మినిస్టర్‌లు(మన దగ్గర సీఎంల హోదాతో సమానం) అనధికార సమావేశం జరిపి, తమ స్వాతంత్ర్య ఆకాంక్షను వ్యక్తం చేసే ప్రకటనపై సంతకాలు చేశారు. దేశం కలిసుండాలా, విడిపోవాలా అనేది... అందుకు అనుసరించాల్సిన పద్ధతేమిటన్నది లండన్‌లోని జాతీయ పార్లమెంటు మాత్రమే నిర్ణయించాల్సిన అంశం కాబట్టి, ఇప్పటికప్పుడు దీనివల్ల జరిగేదేమీ ఉండదు. కానీ ఆర్థిక సంక్షోభాలు అగ్రరాజ్యాల్ని సైతం ఎలా కుదిపేస్తున్నాయో చెప్పడానికి తాజా పరిణామం ఉదాహరణ. అమెరికాపై పాతికేళ్లనాడు ఉగ్రదాడి జరిగినప్పుడు 3,000 మందిని పొట్టనబెట్టుకోవడం మినహా ఆ ఉగ్రవాదులు సాధించిందేమిటన్న ప్రశ్న వినబడింది. అటు తర్వాత అమెరికా సవ్యంగావుంటే ఉగ్రవాదం అంతరించేది. కానీ జరిగిందంతా అందుకు భిన్నం. అప్పట్లో అందరినుంచీ అమెరికాకు మద్దతు లభించింది. కొత్తగా అధికారంలోకొచ్చిన రష్యా అధినేత పుతిన్ అమెరికా ప్రారంభించిన 'ఉగ్రవాదంపై యుద్ధా'నికి సంపూర్ణ మద్దతు ప్రకటించి, తాలిబన్ల వేటకు మధ్య ఆసియాలోని పూర్వపు సోవియెట్ సైనిక స్థావరాల వినియోగానికి ఉదారంగా అనుమతించారు. నాటో ఆవిర్భవించి అప్పటికి యాభైయ్యేళ్లు దాటగా... అందులోని మొదటి క్లాజు 'సమష్టి రక్షణ'ను తొలిసారి ఉపయోగించి ఆ సంస్థ అమెరికాకు బాసటగా నిలిచింది. ఇలా చిన్నా పెద్దా దేశాలన్నీ తాలిబన్‌ల వేటకు తోడ్పడ్డాయి.**

కానీ దీన్ని అమెరికా దుర్వినియోగం చేసింది. మానవ హక్కుల ఉల్లంఘన సంగతలా వుంచి ఇరాక్ మొదలు పలు దేశాలపై విరుచుకుపడి ధ్వంసరచనకు, మారణహోమాలకు పాల్పడింది. లక్షల కోట్ల డాలర్లను మంచినీళ్లప్రాయంగా ఖర్చు చేసింది. ప్రతీకారేచ్ఛ క్రమంలో తాను దివాలా తీస్తున్నాననీ, నమ్ముకున్న వారిని నట్టేట ముంచుతున్నాననీ, చైనాపై కన్నేసి వుంచాలన్న సంగతి మరిచాననీ గ్రహించలేక పోయింది. ఉగ్రదాడికి ముందు మిగులు బడ్జెట్‌లో ఉన్న అమెరికా ఇప్పుడు 40 లక్షల కోట్ల డాలర్లకుపైగా అప్పుల్లో కూరుకుపోయింది. కరోనా మహమ్మారి పాత్ర కూడా ఇందులో ఉండొచ్చుగానీ... విచక్షణారహిత యుద్ధాల పరంపరే దాన్ని ఈ స్థితికి చేర్చింది. 'తిలా పాపం తలా పిడికెడు' అన్నట్టు యుద్ధాల్లో పాలుపంచుకున్న నాటో బలహీన పడింది. అన్ని దేశాలూ ఆర్థిక సుడిగుండంలో చిక్కుకున్నాయి. ఈ కష్టాల పరంపరనుంచి గట్టెక్కటం కోసమే ఆరేళ్ల క్రితం ఈయూ నుంచి బ్రిటన్ బయటికొచ్చింది. బ్రెగ్జిట్ రిఫరెండమ్‌లో దీన్ని నార్తర్న్ ఐర్లాండ్, స్కాట్లాండ్ ప్రజానీకం తిరస్కరించారు. కానీ వారి అభీష్టానికి విలువ లేకుండాపోయింది. ఇప్పుడు బ్రిటన్‌నుంచి విడిపోవటంతోపాటు ఈయూలో చేరటం కూడా ఈ ముగ్గురు అధినేతల ఎజెండా. చారిత్రకంగా మన రాష్ట్రాల కన్నా వేల్స్, నార్తర్న్ ఐర్లాండ్, స్కాట్లాండ్ భిన్నమైనవి. వేల్స్‌ను 13వ శతాబ్దంలో ఇంగ్లండ్ ఆక్రమించుకుంది. రాచరికాలు చుట్టరికం కలుపుకోవటంతో స్కాట్లాండ్,ఇంగ్లండ్ కలిసి ప్రయాణించి వందేళ్ల తర్వాత కలిసి 1703లో గ్రేట్ బ్రిటన్‌గా ఏర్పడ్డాయి. 1801లో దానిలో చేరిన ఐర్లాండ్ 1921లో విడిపోయింది. కానీ ఉత్తర ప్రాంతంలోని ఆరు కౌంటీలు యూకేలోనే కొనసాగుతామన్నాయి. బ్రిటన్ తప్పుడు నిర్ణయాలతో అన్ని ప్రాంతాలనూ భ్రష్టు పట్టించటంతోపాటు, వాటి అధికారాలను కుదిస్తూవచ్చింది. పన్నుల ఆదాయాన్ని సరిగా పంచక 90 దశకం చివర్లో హామీ ఇచ్చిన స్వయంప్రతిపత్తి హోదాకు ముప్పు తెస్తోందన్నది వాటి అభిప్రాయం. నిరుద్యోగం, జనాభా క్షీణతపై తమకు సరైన నిర్ణయాధికారాలు లేవని వాటి ఫిర్యాదు. సంక్షోభాలు చుట్టుముట్టినప్పుడైనా సక్రమంగా వ్యవహరించటం చేతకాకపోతే అవి మరింత ముదురుతాయి. ఫెడరల్ వ్యవస్థను నీరుగార్చి ప్రశాంతంగా మనుగడ సాగించాలనుకోవటం చెల్లదని బ్రిటన్ పాలకులు గుర్తించకపోతే... ఇప్పటికి కేవలం రాజకీయ హెచ్చరికగానే తలెత్తిన ఈ నిరసన ఆ ప్రాంత జనాభాను తాకడానికి ఎన్నాళ్లో పట్టదు. అప్పుడు బ్రిటన్ లండన్‌గా మిగిలిపోక తప్పదు. చేసిన పాపాలు శాపాలై వెంటాడ తాయంటారు.

# పోలవరం ఎత్తు విషయంలో జగన్ దుష్ప్రచారం

**అమరావతి సెప్టెంబర్ 18, అనంత జనశక్తి న్యూస్**

పోలవరం ప్రాజెక్టు ఎత్తు విషయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న దుష్ప్రచారాన్ని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రంగా ఖండించారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తును 41.15 మీటర్లకే పరిమితం చేస్తూ గత వైసీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు అథారిటీకి పలుమార్లు ప్రతిపాదనలు పంపిందని, ఇప్పుడు ఆ తప్పులను కూటమి ప్రభుత్వంపై రుద్దే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు.2022 జనవరిలో వైసీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును ఫేజ్ 1, ఫేజ్ 2గా విభజిస్తూ, 41.15 మీటర్ల ఎత్తును ప్రతిపాదించిందని మంత్రి తెలిపారు. అప్పటి స్పెషల్ సీఎస్ పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈవోకు లేఖ రాసి రూ.10,911.15 కోట్ల నిధులు కోరారని చెప్పారు. అనంతరం జలవనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, పోలవరం ప్రాజెక్టు సీఈ తదితరులు కూడా వైసిపి పాలనలో పలుమార్లు లేఖలు రాశారని, ఆ లేఖల్లో పోలవరం ఎత్తు 41.15 మీటర్లుగా స్పష్టంగా పేర్కొన్నారని తెలిపారు.పోలవరం నీటి నిల్వను 41.15 మీటర్లు, 45.72 మీటర్లుగా విభజించి ప్రాజెక్టును ప్రశ్నార్థకం చేసింది జగన్ ప్రభుత్వం కాదా? అని మంత్రి నిమ్మల ప్రశ్నించారు. 2024 ఫిబ్రవరి 16న వైసీపీ ప్రభుత్వ హయాంలోనే కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ పోలవరం ప్రాజెక్టు ఫేజ్ 1 అంచనా వ్యయాన్ని రూ.30,436.95 కోట్లుగా నిర్ధారించిందని మంత్రి గుర్తు చేశారు.201419 మధ్య టీడీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును ఎప్పుడూ ఫేజ్ 1, ఫేజ్ 2గా విభజించలేదని స్పష్టం చేశారు. నాటి టిడిపి ప్రభుత్వం హాయాంలోనే 11.02.2019 న జరిగిన 141 వ సాంకేతిక సలహా కమిటీ (టిఏసి) సమావేశంలో 201718 ధర స్థాయి (పిఎల్) ప్రకారం రూ. 55, 548. 87 కోట్లకు 45.72 మీటర్ల ఎత్తుకు టెక్నికల్ అడ్వైజరీ కమిటీ ఆమోదం లభించిందని చెప్పారు. "నాడు మా ప్రభుత్వ హయాంలో ఫేజ్ 1, ఫేజ్ 2 అనే ప్రతిపాదన ఎక్కడైనా ఉందా? జగన్ చేసిన పాపానికి మా ప్రభుత్వాన్ని బాధ్యులను చేయాలని చూస్తున్నారు. నాడు వైసిపి ఫేజ్ 1, ఫేజ్ 2 ప్రతిపాదన అంగీకారం కు సంబందించి అన్ని ఆధారాలు ఉన్నాయి." అని మంత్రి నిమ్మల అన్నారు.

**45.72 మీటర్ల ఎత్తుతోనే పోలవరం నిర్మాణం**

గోదావరి వాటర్ డిస్ప్యూట్స్ ట్రిబ్యునల్ అవార్డు 1980 ప్రకారం పోలవరం స్పిల్‌వే, ఈసీఆర్ఎఫ్ డిజైన్లు 45.72 మీటర్ల ఎత్తుతో, 194.60 టీఎంసీల పూర్తి నిల్వ సామర్థ్యానికి అనుగుణంగానే రూపొందించబడ్డాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కూడా పోలవరం నిర్మాణ పనులను 45.72 మీటర్ల ఎత్తు, 194.60 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతోనే పూర్తి చేస్తోందని స్పష్టం చేశారు. "పోలవరం ఎత్తు విషయంలో కూటమి ప్రభుత్వం, గత ప్రభుత్వం మాదిరిగా, ఏమాత్రం రాజీపడదు అని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు, గోదావరి ట్రిబ్యునల్ అనుమతించిన మేరకు 45.72 మీటర్ల ఎత్తుతో నీటిని నిల్వ చేసేలా, ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తవుతున్నాయని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మొదట 41.15 మీటర్లకు నీరు నిల్వ చేసి, తర్వాత 45.72 మీటర్ల కాంటూరుకు నిల్వ చేసేందుకు అవసరమైన ఆర్అండ్ఆర్ ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్రం నుండి ఆమోదం కోరతామని అన్నారు

**పోలవరాన్ని విధ్వంసం చేసింది వైసీపీ ప్రభుత్వమే.**

పోలవరం ప్రాజెక్టును విధ్వంసం చేసి, ప్రాజెక్టు భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసింది గత వైసీపీ ప్రభుత్వమేనని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. పోలవరం లెఫ్ట్ కెనాల్ సామర్థ్యాన్ని 17,500 క్యూసెక్కుల నుంచి 8,122 క్యూసెక్కులకు తగ్గించడం ద్వారా ఉత్తరాంధ్ర ప్రయోజనాలకు గండికొట్టారని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేసి ఉంటే ఎల్‌నినో వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా రాష్ట్రంలోని మూడు ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించగలిగేవారమని మంత్రి తెలిపారు. సుమారు 400 టీఎంసీల నీటిని రాష్ట్రంలోని మూడు ప్రాంతాలకు తరలించి ప్రయోజనం కల్పించే అవకాశం ఉండేదని చెప్పారు. "పోలవరం ఎప్పుడు పూర్తవుతుందో చెప్పలేం" అని స్వయంగా నాడు అసెంబ్లీలో ప్రకటించిన వారు ఇప్పుడు పోలవరం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని మంత్రి అన్నారు.

**డయాఫ్రం వాల్‌ను ధ్వంసం చేసి ప్రాజెక్టు భవిష్యత్తును ప్రశ్నార్థకం చేశారు**

వైసీపీ హయాంలో పోలవరం డయాఫ్రం వాల్ దెబ్బతినడంతో ప్రాజెక్టు నిర్మాణం మరింత క్లిష్టంగా మారిందని మంత్రి తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో డయాఫ్రం వాల్ ప్రాధాన్యత కూడా తెలియని విధంగా నాటి పాలకులు వ్యవహరించారని విమర్శించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో కేంద్రం నుంచి నిధులు సాధించి పోలవరం పనులను తిరిగి గాడిలో పెట్టామని మంత్రి తెలిపారు. ప్రశ్నార్థకంగా మారిన పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామనే భరోసాను ప్రజలకు కల్పించామని అన్నారు.

**పట్టిసీమతో కృష్ణా డెల్టాకు జీవనాడి**

పట్టిసీమ ప్రాజెక్టును గతంలో వృథా ప్రాజెక్టుగా విమర్శించిన వారు, తాము అధికారంలోకి వస్తే పట్టిసీమ, పురుషోత్తమపట్నం పంపులు పీకేస్తామని చెప్పారని మంత్రి గుర్తు చేశారు. అయితే పట్టిసీమ ద్వారా వచ్చిన 500 టిఎంసిల గోదావరి జలాలతో కృష్ణా డెల్టాలో ఐదేళ్లలో సుమారు రూ.50 వేల కోట్ల ఆదాయం సృష్టించగలిగామని తెలిపారు. ఎల్‌నినో వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా పట్టిసీమ కృష్ణా డెల్టాకు ఊపిరి పోస్తోందని చెప్పారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు పట్టిసీమ నుంచి 45 టీఎంసీలకు పైగా గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలించామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం కృష్ణా డెల్టాలో సుమారు 6.80 లక్షల ఎకరాల్లో పంట సాగు జరుగుతోందంటే అందుకు పట్టిసీమ నీరు కీలక కారణమని చెప్పారు. పట్టిసీమ నీరు కృష్ణాడెల్టాకు అందడం వలనే శ్రీశైలం నుండి కృష్ణా నీరు పోతిరెడ్డిపాడు, హంద్రీనీవా ద్వారా రాయలసీమ అమసరాలకు ఇవ్వగల్గుతున్నామన్నారు. పట్టిసీమ లేకపోతే శ్రీశైలంకు వచ్చిన కృష్ణానీటిని కృష్ణా డెల్టాకు ఇవ్వవలసి వచ్చి ఉండేదన్నారు. చంద్రబాబు నాయుడు ముందుచూపుతో నిర్మించిన పురుషోత్తపట్నం, పుష్కర లిఫ్ట్ స్కీమ్‌ల వల్లే నేడు గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తరలించగలుగుతున్నామని మంత్రి తెలిపారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు పురుషోత్తపట్నం లిఫ్ట్ స్కీమ్ ద్వారా 16.6 టీఎంసీల నీటిని ఎత్తిపోశామని మంత్రి వెల్లడించారు.






## యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

### కలెక్టర్ శ్యాం ప్రసాద్ కి వినతి

**పుట్టపర్తి రూరల్, సెప్టెంబర్ 18 (అనంత జనశక్తి న్యూస్)**

గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్కు శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులకు రెండేళ్ల నుండి (ఏహెచ్ఏ) ఉద్యోగ అవస్థలు తప్పడం లేదనీ. ప్రొబేషనరీ కాలపరిమితి ముగిసినా ప్రభుత్వం ఇంతవరకు డిక్లరేషన్ ఇవ్వకపోవడంతో వారు ఆందోళన బాట పట్టారు. ఈ సందర్భంగా శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా ఉద్యోగు లు కలెక్టరేట్ చేరుకుని అక్కడ
తమకు ఉద్యోగ భద్రత కల్పించి రెగ్యులర్ చేయాలని కోరుతూ ఏహెచ్ఏ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టర్ శ్యాం ప్రసాద్ కు వినతి పత్రం అందజేశారు.
ఈ కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు, మూడవ బ్యాచ్ ఏహెచ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ (ఐకానిక్ భవనం) నిర్మాణానికి రూ.661 కోట్లకు పరిపాలనామోదం




(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిర్వహించిన 66వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం వివరాలను ఏపీ సచివాలయం లోని ప్రచార విభాగంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి వెల్లడించారు.రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లో సైతం మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ఒక వ్యక్తికి 135 లీటర్లు అందించడానికి అవసరమైన పైపుల సామర్థ్యం పెంపు, మెయిన్ డ్రైనేజీకి లింక్ డ్రైనేజీ పైపులు ఏర్పాటు, ఎన్ఎస్పీ(నెగోషియేటివ్ సెటిల్మెంట్ పాలసీ) తో కలిపి రూ. 1548 కోట్లు తో టెండర్లు పిలవడానికి పరిపాలనా అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు.రాష్ట్రంలో స్టాండర్డ్స్ ప్రైవేట్ స్కూల్స్ కూడా రాజధాని ప్రాంతంలో నిర్మాణానికి అనుమతులు ఇచ్చామన్నారు. అందులో భాగంగానే నలందా ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ వారికి 5 ఎకరాలు కృష్ణాయపాలెంలో ఇవ్వడం జరిగిందన్నారు. ఏడాదిన్నరలో స్కూల్ నిర్మాణం పూర్తవనుందని మంత్రి తెలిపారు. హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ కార్యాలయ నిర్మాణానికి నేలపాడులో 50 సెంట్లు భూమి కేటాయించడం జరిగిందన్నారు. ల్యాండ్ పూలింగ్ కు భూములు ఇచ్చిన రైతులకు ఎకరాకు కౌలు జరీబు అయితే రూ. 50వేలు, నాన్ జరీబు అయితే రూ. 40వేలు అందిస్తున్నామన్నారు. 2014 19 మధ్యలో భూ సమీకరణలో భాగంగా భూములు ఇచ్చిన ఎకరం కంటే తక్కువ ఉన్నా గతంలో వారికి రూ. 30వేలు ఇచ్చామన్నారు. రెండో విడత భూ సమీకరణ సందర్భంగా రైతుల విజ్ఞప్తి మేరకు వారికి కూడా కౌలు రూ. 40వేలు ఇవ్వడానికి అథారిటి అనుమతి లభించిందన్నారు. అక్టోబర్ చివరి నాటికి రెవెన్యూ సమస్యలను సైతం పరిష్కరించి ల్యాండ్ పూలింగ్ 80 శాతం పూర్తి చేస్తామని మంత్రి నారాయణ ఆశాభావం వ్యక్తం చేశారు.

## దానం నాగేందర్‌పై అనర్హత వేటు

(మొదటి పేజీ తరువాయి)

మరోవైపు ఈ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల్లో తెల్లం వెంకట్‌రావు, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ప్రకాష్‌గౌడ్, అరికెపూడి గాంధీ, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాలె యాదయ్య, సంజయ్‌కుమార్, కడియం శ్రీహరి ఉన్నారు. వీరంతా కూడా న్యాయపోరాటం చేస్తున్నారు. అయితే వీరంతా కూడా తాము బీఆర్ఎస్ లోనే ఉన్నామని చెబుతున్న సంగతి తెలిసిందే.
అయితే ఫిరాయించిన ఎమ్మెల్యేల్లో ఒకరిగా ఉన్న దానం నాగేందర్.... 2024లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ బీఫారమ్ పై సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ... బీఆర్ఎస్ తో పాటు బీజేపీ నేతలు ఎమ్మెల్యే దానంను చాలా రోజులుగా టార్గెట్ చేస్తున్నారు. దానంపై అనర్హత పిటిషన్ వేసిన వాళ్లలో ఒక్క బీఆర్ఎస్ మాత్రమే కాకుండా... బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఈ పిటిషన్లను అనుమతించిన హైకోర్టు.... సంచలన తీర్పుని వెలువరించింది.
తెలంగాణ రాజకీయాల్లో ఖైరతాబాద్ నియోజకవర్గం మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేస్తూ తీర్పు ఇచ్చిన నేపథ్యంలో.. ఆయన చేసిన తాజా వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నానని. అదే సమయంలో ఉపఎన్నికలు వస్తే ఎదుర్కొనేందుకు తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. హైకోర్టు తీర్పుపై స్పందించిన దానం నాగేందర్.. ప్రస్తుతం సుప్రీంకోర్టును ఆశ్రయించే ఆలోచన లేదని చెప్పారు. న్యాయస్థానం తీర్పును గౌరవిస్తున్నానని పేర్కొంటూనే.. రాజకీయాల్లో పోరాటాలు తనకు కొత్తేమీ కాదన్నారు. ఇంతకాలం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ఈ స్థాయికి వచ్చానని వ్యాఖ్యానించారు.
ఖైరతాబాద్ ఎమ్మెల్యే స్థానానికి ఉపఎన్నిక జరిగే పరిస్థితి వస్తే తాను పోటీకి సిద్ధంగా ఉన్నట్లు దానం నాగేందర్ ప్రకటించారు. ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు వచ్చినా ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటామని అన్నారు. ఎన్నికల్లో పోటీ చేయడం, రాజకీయ పోరాటాలు చేయడం తనకు కొత్త కాదని పేర్కొన్నారు. ఉపఎన్నికను రాజకీయ పోరాటంగా అభివర్ణించిన దానం నాగేందర్.. మళ్లీ ప్రజల్లోకి వెళ్లి తన బలాన్ని నిరూపించుకుంటాననే ధీమా వ్యక్తం చేశారు. ఈ పోరులో విజయం సాధిస్తానని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. దీంతో హైకోర్టు తీర్పు తర్వాత ఖైరతాబాద్‌లో రాజకీయ సమీకరణాలపై ఆసక్తి మరింత పెరిగింది.
2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. అనంతరం ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత పార్టీ మారడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి వేర్వేరుగా దానం నాగేందర్‌పై అనర్హత పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన తెలంగాణ హైకోర్టు తాజాగా తీర్పు వెలువరించింది. దానం నాగేందర్‌పై అనర్హత వేటు విధించింది.
హైకోర్టు తీర్పుతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానంలో ఉపఎన్నిక జరిగే అంశం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే తదుపరి న్యాయపరమైన పరిణామాలు, ఎన్నికల ప్రక్రియపై అధికారిక నిర్ణయాల ఆధారంగానే ఉపఎన్నికపై స్పష్టత రానుంది. మరోవైపు దానం నాగేందర్ మాత్రం ఇప్పటికే ఎన్నికల పోరుకు సిద్ధమనే సంకేతాలు ఇచ్చారు. తాను వెనక్కి తగ్గేది లేదని, మరోసారి ప్రజాక్షేత్రంలో పోరాడేందుకు సిద్ధంగా ఉన్నానని ఆయన వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో ఖైరతాబాద్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ రాజకీయ వ్యూహాలు ఎలా ఉండబోతున్నాయన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.

# చెత్త దోపిడీపై మంత్రి నారాయణ బహిరంగ చర్చకు రావాలి: కాకాణి

**నెల్లూరు, సెప్టెంబర్ 18:అనంత జనశక్తి న్యూస్**

రాష్ట్రంలో చెత్త నిర్వహణ పేరుతో రూ.1,200 కోట్ల అవినీతి జరిగిందంటూ తాము చేస్తున్న ఆరోపణలపై మంత్రి నారాయణ బహిరంగ చర్చకు రావాలని మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. నెల్లూరు నగరంలోని వీఆర్‌సీ కూడలిలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శాసనమండలి సభ్యుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.చెత్త నిర్వహణకు సంబంధించిన వ్యవహారాల్లో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ తమ వద్ద ఆధారాలు ఉన్నాయని కాకాణి తెలిపారు. మంత్రి నారాయణకు డబ్బుతో సంబంధం లేదని చెబుతున్నప్పటికీ, తాము అడిగిన పన్నుల వివరాలు, లెక్కలపై ఎందుకు స్పష్టమైన సమాధానం ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఆధారాలతో సహా తాము చర్చకు సిద్ధంగా ఉన్నామని, మంత్రి కూడా బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు.నెల్లూరు నగర ప్రజలు, పేదలపై ఒత్తిడి తెచ్చి పన్నులు వసూలు చేశారని కాకాణి ఆరోపించారు. విద్యుత్ కనెక్షన్లు తొలగించడం, మంచినీటి సరఫరాను నిలిపివేయడం వంటి చర్యలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు.లెగసీ చెత్త నిల్వలకు సంబంధించిన లెక్కలు రూ.85 లక్షల నుంచి రూ.1.65 కోట్లకు పెంచిన విధానంపై అనుమానాలు ఉన్నాయని తెలిపారు. ఈ అంశానికి సంబంధించిన వివరాలను శాసనమండలి సభ్యుడు చంద్రశేఖర్ రెడ్డి గత మూడు, నాలుగు నెలలుగా సేకరించారని చెప్పారు. చెత్త నిర్వహణలో అవినీతి, అక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని ఆధారాలతో సహా ప్రజల ముందుకు తీసుకువస్తామని ప్రకటించారు.మంత్రి నారాయణ తమ ఆరోపణలకు సమాధానం ఇవ్వకుండా కేవలం విలేకరుల సమావేశాల్లో వివరణ ఇస్తున్నారని కాకాణి విమర్శించారు. నెల్లూరు ప్రజల సమక్షంలో బహిరంగ చర్చకు రావాలని మరోసారి డిమాండ్ చేశారు.

**ప్రతి కేంద్రంలో నిరసనలు**

నెల్లూరు నగరంలో చెత్త నిర్వహణలో జరిగినట్లు తాము ఆరోపిస్తున్న అవినీతి, దోపిడీని ప్రజలకు సవివరంగా తెలియజేస్తామని కాకాణి తెలిపారు. సేకరించిన సమాచారాన్ని పరిశీలించి, ఆధారాలతో ప్రజల ముందుకు తీసుకువస్తామని చెప్పారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు.అధికార పార్టీ నాయకులు ఆత్మ విశ్వాసం ప్రదర్శించడం కాకుండా, తమ వద్ద ఉన్న ఆధారాలపై బహిరంగ చర్చకు రావాలని కాకాణి కోరారు. రాజ్యాంగ స్ఫూర్తిని, పేద ప్రజల హక్కులను పరిరక్షించేందుకు అంబేద్కర్‌తో పాటు ఇతర మహనీయుల విగ్రహాల వద్ద నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## జన్వాడ ఫామ్‌హౌస్ నాదీ

**హైదరాబాద్, అనంత జనశక్తి న్యూస్**

హైదరాబాద్‌లోని జన్వాడ ఫామ్‌హౌస్ వ్యవహారం మరోసారి రాజకీయ చర్చకు దారితీస్తున్న వేళ.. ఆ ఆస్తి యజమానిగా చెప్పుకుంటున్న ప్రదీప్‌రెడ్డి రియాక్ట్ అయ్యారు. జన్వాడ ఫామ్‌హౌస్ ఉన్న భూమి తన సొంతమని స్పష్టమయ్యారు. ఆ భూమిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ , మాజీ మంత్రి కేటీఆర్‌కు యాజమాన్య హక్కు లేదని ఆయన తేల్చి చెప్పారు. కేటీఆర్ తనకు చిన్ననాటి నుంచి స్నేహితుడని.. తనకు చెందిన ప్రాపర్టీని ఆయనకు లీజుకు ఇచ్చినట్లు ప్రదీప్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఫామ్‌హౌస్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రదీప్‌రెడ్డి మాట్లాడారు.
జన్వాడ ఫామ్‌హౌస్ తన వ్యక్తిగత ఆస్తి అని ప్రదీప్‌రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. 2019లో ఈ ప్రాపర్టీని కొనుగోలు చేసి.. ఆ తర్వాత కేటీఆర్‌కు లీజుకు ఇచ్చానని ఆయన చెప్పారు. కేటీఆర్‌తో తనకు చిన్ననాటి నుంచే స్నేహం ఉందని పేర్కొన్నారు. ఫామ్‌హౌస్ భూములకు సంబంధించి ఎలాంటి వివాదం లేదని.. ఆస్తికి చట్టబద్ధమైన టైటిల్ ఉందని వెల్లడించారు.
రాష్ట్ర ప్రభుత్వానికి గానీ సంబంధిత అధికారులకు ఆస్తిపై ఏవైనా సందేహాలు ఉంటే.. తనకు నోటీసులు జారీ చేసి వివరణ కోరవచ్చని ప్రదీప్‌రెడ్డి తేల్చి చెప్పారు. అవసరమైన పత్రాలు, వివరాలను చట్టపరమైన ప్రక్రియలో అధికారులకు అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. జన్వాడ ఫామ్‌హౌస్‌ను కాంగ్రెస్ నేతలు శనివారం పరిశీలించేందుకు, ముట్టడించేందుకు వస్తారన్న ప్రచారంపైనా ప్రదీప్‌రెడ్డి స్పందించారు. ప్రైవేట్ ఆస్తి వద్దకు రాజకీయ నాయకులు వచ్చి తనిఖీ చేయడం.. దాన్ని రాజకీయ వివాదంగా మార్చడం సరికాదని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

**ఆస్తికి సంబంధించి ప్రభుత్వానికి ఏవైనా అనుమానాలు ఉంటే చట్ట ప్రకారం విచారణ జరపవచ్చని తెలిపారు. అధికారులు అడిగే సమాచారం.. పత్రాలను సమర్పించేందుకు తాను పూర్తిగా సహకరిస్తానని స్పష్టం చేశారు. జన్వాడలోని భూములు, ఫామ్‌హౌస్‌కు సంబంధించి తెలంగాణ రాజకీయాల్లో ఇటీవల మళ్లీ చర్చ మొదలైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో జన్వాడ ఆస్తులపై పలు ఆరోపణలు చేయగా.. బీఆర్ఎస్ నేతలు వాటిని ఖండిస్తూ స్పందించారు. కాంగ్రెస్ నేతలు కూడా సంబంధిత భూములపై వివరాలు పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఫామ్‌హౌస్ యజమానిగా పేర్కొంటున్న ప్రదీప్‌రెడ్డి తాజాగా చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అయితే భూమి యాజమాన్యం, టైటిల్, ఇతర ఆరోపణలకు సంబంధించిన తుది నిర్ధారణ అధికారిక రికార్డులు, చట్టపరమైన విచారణల ఆధారంగానే తేలాల్సి ఉంటుంది. ప్రస్తుతం ప్రదీప్‌రెడ్డి మాత్రం జన్వాడ ఫామ్‌హౌస్ తన సొంత ఆస్తేనని.. కేటీఆర్‌కు దాన్ని లీజుకు మాత్రమే ఇచ్చానని స్పష్టం చేశారు. ప్రభుత్వ అధికారులు చట్టబద్ధంగా ఏ విచారణ చేపట్టినా సహకరిస్తానని తెలిపారు.**

# ఆశా వర్కర్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### ఏపీ ఆశ వర్కర్ల సంఘం

**పుట్టపర్తి రూరల్ సెప్టెంబర్ 18 అనంత జన శక్తి న్యూస్.**

జిల్లాలో ఆశా వర్కర్స్ ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ ఫైరోజ్ బేగం కి వినతిపత్రం అందజేశారు. పుట్టపర్తి డిఎంహెచ్వో కార్యాలయం లో వినతి పత్రం అందజేశారు.
ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆశా వర్కర్స్‌తో రికార్డులు రాయిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని, ఆశా వర్కర్స్‌పై అనవసరమైన పనిభారం మరియు ఒత్తిడి లేకుండా చూడాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు.ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆశా వర్కర్స్‌తో రికార్డులు రాయిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి.2025 డిసెంబర్‌లో ఆశా వర్కర్స్‌గా విధుల్లో చేరిన వారికి పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలి. అర్హులైన ఆశా వర్కర్స్‌కు వితంతు పెన్షన్, తల్లికి వందనం తదితర సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలి.అనారోగ్యంతో మరణించిన ఆశా వర్కర్స్ కుటుంబాలకు చెల్లించాల్సిన గ్రాట్యుటీ మొత్తాన్ని వెంటనే చెల్లించాలి.మరణించిన ఆశా వర్కర్స్ కుటుంబాల్లో అర్హులైన వారికి ఆశా వర్కర్స్‌గా అవకాశం కల్పించాలి.ఆశా వర్కర్స్‌కు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని హక్కులు, ప్రయోజనాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలనీ, కోరారు.
వినతిపత్రం స్వీకరించిన అనంతరం డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్ బేగం స్పందిస్తూ, ఇకపై ఆశా వర్కర్స్‌తో రికార్డులు రాయించవద్దని అధికారులకు ఆదేశాలు ఇస్తామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఆశా వర్కర్స్‌తో రికార్డులు రాయిస్తున్న అధికారులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.
అక్టోబర్ 10వ తేదీ నుంచి 20వ తేదీలోపు జిల్లా ఆశా నోడల్ ఆఫీసర్, జిల్లా అధికారులు మరియు ఆశా యూనియన్ నాయకులతో సంయుక్త సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈ విషయంపై జిల్లాలోని అన్ని మెడికల్ ఆఫీసర్లతో శుక్రవారం జూమ్ సమావేశం నిర్వహించి స్పష్టమైన ఆదేశాలు ఇస్తామని చెప్పారు.*
అదేవిధంగా 2025 డిసెంబర్‌లో విధుల్లో చేరిన ఆశా వర్కర్స్‌కు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వచ్చే నెల 5వ తేదీలోపు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్ బేగం హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ జిల్లా నోడల్ ఆఫీసర్ త్రిలోక్‌నాథ్, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బీకే రాధమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. సౌభాగ్యమ్మ, జిల్లా కోశాధికారి పి. రమాదేవి, జిల్లా గౌరవ అధ్యక్షులు బి. సాంబశివ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంకె ముత్యాలు, జిల్లా నాయకులు రామ్మోహన్, సిద్ధు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు ముంతాజ్, అంజినమ్మ, మహాలక్ష్మి, చంద్రకళ, సుశీల తదితరులు పాల్గొన్నారు.



# పెండింగ్ పనులతో 7 వేల ఎకరాలకు సాగునీరు దూరం: ఎమ్మెల్యే జీఎంఆర్

**గన్‌పూర్ సెప్టెంబర్ 18, అనంత జనశక్తి న్యూస్**



కేఎల్ఐ గన్‌పూర్ బ్రాంచ్ కెనాల్ పరిధిలోని పెండింగ్ పనులను గత పాలకులు పూర్తి చేయకపోవడం వల్ల వేలాది ఎకరాలకు సాగునీరు అందడం లేదని ఎమ్మెల్యే జీఎంఆర్ ఆరోపించారు. గన్‌పూర్ బ్రాంచ్ కెనాల్ నుంచి డీ8, డీ12, డీ13 కాలువల ద్వారా సుమారు 7 వేల ఎకరాల ప్రత్యక్ష ఆయకట్టుకు, మరో 4 నుంచి 5 వేల ఎకరాల పరోక్ష ఆయకట్టుకు సాగునీరు అందించే అవకాశం ఉన్నప్పటికీ రైతులకు ఆ ప్రయోజనం దక్కలేదని ఆయన పేర్కొన్నారు.మాజీ ఎమ్మెల్యే హయాంలో పెండింగ్ పనులు ఎందుకు పూర్తి కాలేదని జీఎంఆర్ ప్రశ్నించారు. గన్‌పూర్ బ్రాంచ్ కెనాల్‌లో దాదాపు రెండు కిలోమీటర్ల మేర పనులను ఎందుకు పెండింగ్‌లో పెట్టారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. డీ12 కాలువలో సుమారు 300 మీటర్ల మేర ఉన్న చిన్న పనిని కూడా ఎందుకు పూర్తి చేయలేకపోయారని ప్రశ్నించారు.కేఎల్ఐ నీటితో చెరువులు నిండితే మట్టి తరలింపు కాంట్రాక్టు పనులకు ఇబ్బందులు వస్తాయనే కారణంతో చెరువులను నింపకుండా నిర్లక్ష్యం చేశారన్న ఆరోపణలపై మాజీ ఎమ్మెల్యే వివరణ ఇవ్వాలని జీఎంఆర్ కోరారు. రైతుల సాగునీటి అవసరాల కంటే కాంట్రాక్టు ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చారా అని ప్రశ్నించారు.రాజకీయ పదవిలో ఉన్నప్పుడు ప్రజల కోసం పనిచేయాలా? లేక కాంట్రాక్టుల కోసం పనిచేయాలా? అని జీఎంఆర్ నిలదీశారు. చిన్నచిన్న పెండింగ్ పనులను పూర్తి చేస్తే వేలాది ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందని తెలిపారు. రైతుల భవిష్యత్తును కాంట్రాక్టు ప్రయోజనాలకు తాకట్టు పెట్టకుండా కాలువల పెండింగ్ పనులను పూర్తి చేయడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. "మాటలు కాదు.. కాలువల్లో నీళ్లు. హామీలు కాదు.. రైతు పొలంలో పచ్చని పంట" అనే లక్ష్యంతో ముందుకు సాగుతామని ఎమ్మెల్యే జీఎంఆర్ పేర్కొన్నారు.

# 'సేవా సంకల్ప్ అభియాన్'

- మోదీ 25 ఏళ్ల ప్రజా సేవ.. నెల రోజుల పాటు నిర్వహణ
- బీజేపీ స్టేట్ చీఫ్ పీవీఎన్ మాధవ్
- సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు

**అమరావతి, సెప్టెంబర్ 18 (అనంత జనశక్తి న్యూస్)**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా 25 వసంతాల ప్రజా సేవను పూర్తి చేసుకున్నారని బీజేపీ ఏపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ అన్నారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల్లోకి కేంద్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, వివిధ సేవా కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతున్నామని చెప్పారు. సమాజ సేవలో నిమగ్నమై పనిచేస్తున్న టీచర్లు, అంగన్వాడీ వర్కర్లు, శానిటరీ వర్కర్లు తదితరులను సన్మానించి వారి సేవలకు గుర్తింపు, గౌరవం కల్పిస్తామన్నారు. యువతలోని సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు 'ఇన్నోవేషన్ ఛాలెంజ్' నిర్వహించి, కొత్త ఆవిష్కరణలు చేస్తున్న యువతకు ప్రోత్సాహం అందించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో చిత్రలేఖనం, ఎలక్యూషన్ వంటి పోటీలు నిర్వహించేలా కార్యక్రమాలను రూపొందించామని మాధవ్ తెలిపారు. మొత్తం 13 రకాల కార్యక్రమాలను నెల రోజుల పాటు నిర్వహించనున్నట్లు చెప్పారు. అక్టోబర్ 17న ఢిల్లీలో దేశవ్యాప్తంగా ప్రజా ప్రతినిధులు పాల్గొనేలా భారీ కార్యక్రమం నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. నిన్న(గురువారం) దేశవ్యాప్తంగా 'ఆశీర్వాద దీపం' కార్యక్రమాన్ని ప్రజలు స్వచ్ఛందంగా నిర్వహించారని తెలిపారు.

మోదీ ప్రజా సేవకు గుర్తింపుగా, ఆయనకు భగవంతుడి ఆశీస్సులు లభించి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రజలు ఇళ్ల ముందు దీపాలు వెలిగించారని మాధవ్ అన్నారు. 'సేవా సంకల్ప్ అభియాన్ పార్టీకి సంబంధించిన కార్యక్రమం కాదని.. ప్రజలందరికీ సంబంధించిన కార్యక్రమం' అని స్పష్టం చేశారు. మోదీ కుటుంబ సభ్యులు, ప్రజలు, యువత, సేవా సంస్థలు ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాలని పీవీఎన్ మాధవ్ కోరారు.

# క్రైమ్ రేట్ తగ్గింది

- ఈగల్ టీమ్ పటిష్టంతోనే సాధ్యమైంది
- హోంమంత్రి అనిత వెల్లడి
- శాంతి భద్రతల బాధ్యత ప్రజలది కూడా..
- పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి

**అమరావతి, సెప్టెంబర్ 18 (అనంత జనశక్తి న్యూస్)**

ఈగల్ ప్రధాన కార్యాలయంలో '20262029 మాదక ద్రవ్యాల నియంత్రణ విజన్ డాక్యుమెంట్' అమలుపై హోం మంత్రి వంగలపూడి అనిత శుక్రవారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల ఈగల్ టీమ్స్‌తో జూమ్ కాల్ ద్వారా సమీక్షించారు. గంజాయి నిర్మూలనలో పురోగతి, భవిష్యత్ కార్యాచరణను అనితకు ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ వివరించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ.. భావితరాల బంగారు భవిష్యత్తు కోసమే సీఎం చంద్రబాబు ఈగల్ టీమ్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. గంజాయి విక్రయాలు, వినియోగంపై సమాచారం ఇచ్చేందుకు 'బ్రేక్ ద సైలెన్స్' పేరిట 1972 టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏపీవ్యాప్తంగా 900 గంజాయి హాట్‌స్పాట్లను జియో ట్యాగింగ్ నిఘాతో గత 4 నెలల్లోనే 20 వేలకు పైగా కేసులు నమోదు అయినట్లు హోం మంత్రి వెల్లడించారు. ఈగల్ టీమ్ పటిష్ఠ నిఘాతోనే రాష్ట్రంలో క్రైమ్ రేట్ 14 శాతం తగ్గిందని అనిత పేర్కొన్నారు.

# దుగరాజపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్

## ఎండీఎల్‌తో ఏపీ సర్కార్ ఎంవోయూ

**అమరావతి, సెప్టెంబర్ 18 (అనంత జనశక్తి న్యూస్)**

**ఏపీలోని దుగరాజపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్ ఏర్పాటు కానుంది. ఈ మేరకు ఎండీఎల్‌తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ఈ ఎంవోయూ చేసుకున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా రూ.15,000 కోట్ల పెట్టుబడితో 45 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఏడాదికి 12 లక్షల టన్నుల నౌకల నిర్మాణ సామర్థ్యాన్ని ఈ గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్ కలిగి ఉంది. కాగా, సీఎం చంద్రబాబు అధ్యక్షతన 21వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం ఈరోజు (శుక్రవారం) సచివాలయంలో జరిగింది. ఈ సమావేశంలో మొత్తం 29 పారిశ్రామిక ప్రాజెక్టులకు సంబంధించిన పెట్టుబడులపై సీఎం చర్చించారు. దాదాపు రూ.22 వేల కోట్ల విలువైన పెట్టుబడులకు సంబంధించిన ప్రాజెక్టులపై ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం తెలిపే అవకాశాలు ఉన్నాయి. తద్వారా దాదాపు 20 వేల మందికి ఉద్యోగాలను కల్పించనున్నారు. ఇప్పటివరకు జరిగిన 20 ఎస్ఐపీబీ సమావేశాల్లో 359 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. రూ.13.84 లక్షల కోట్ల పెట్టుబడులు, 10.59 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఎస్ఐపీబీ సమావేశానికి మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, అనగాని సత్యప్రసాద్, వాసంశెట్టి సుభాశ్, పి.నారాయణ, కందుల దుర్గేశ్, గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్ధన్ రెడ్డి, సీఎస్ సాయిప్రసాద్, పరిశ్రమలు, ఐటీ, ఐ అండ్ ఐ శాఖల కార్యదర్శులు హాజరయ్యారు.**

# పేదల ఇళ్లను క్రమబద్ధీకరించాలి

– జీఓ 58 కింద ఇళ్లు నిర్మించుకున్న వారికి హక్కులు కల్పించాలి: ఎమ్మెల్యే మురళి నాయక్

**హైదరాబాద్, సెప్టెంబర్ 18:అనంత జనశక్తి న్యూస్**

మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలో జీఓ 58 కింద 50 నుంచి 70 గజాల స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న నిరుపేదల ఇళ్లను క్రమబద్ధీకరించి వారికి హక్కులు కల్పించాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే డా. భూక్యా మురళి నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలో సుమారు 1,600 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. గతంలో జీఓ 58 కింద పేదలు చిన్నచిన్న స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నారని, వారి ఇళ్లను క్రమబద్ధీకరించి హక్కులు కల్పించాలని కోరారు.



**1,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి**

మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలో పేదలు ఇళ్ల నిర్మాణానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొత్తబజార్ ప్రాంతానికి 500, మున్సిపాలిటీ పరిధిలో మరో 1,000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రిని కోరారు. అర్హులైన పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేర్చేలా ఇళ్ల సంఖ్య పెంచాలని విజ్ఞప్తి చేశారు.

**ఏజెన్సీ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణ సమస్యలు పరిష్కరించాలి**

ఏజెన్సీ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు అటవీ శాఖకు సంబంధించిన సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణంలో ఆటంకాలు లేకుండా అటవీ అధికారులతో సమన్వయం చేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

**అసంపూర్తి పంచాయతీ భవనాలకు అదనపు నిధులు**

గత ప్రభుత్వం గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి ఒక్కో భవనానికి రూ.12 లక్షలు కేటాయించినప్పటికీ, నిర్మాణాలు పూర్తిచేయడానికి ఆ నిధులు సరిపోక అనేక భవనాలు అసంపూర్తిగా మిగిలిపోయాయని మురళి నాయక్ తెలిపారు. సొంత భవనాలు లేక కొన్ని గ్రామపంచాయతీల పాలనాపరమైన కార్యకలాపాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. అసంపూర్తిగా ఉన్న గ్రామపంచాయతీ భవనాలను పూర్తిచేసేందుకు అదనపు నిధులు మంజూరు చేసి వినియోగంలోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. మహబూబాబాద్ పేదలకు ఇళ్ల హక్కులు, అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, గ్రామపంచాయతీలకు పూర్తిస్థాయి భవనాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అసెంబ్లీలో విజ్ఞప్తి చేశారు.

# డిజిటల్ వ్యవసాయంలో దేశానికే దిక్సూచిగా ఆంధ్రప్రదేశ్

- 52.08 లక్షల మంది రైతులకు ఫార్మర్ ఐడిలు.. 86.8 శాతం అగ్రీస్టాక్ లక్ష్యం పూర్తి
- APAIMS 2.0తో ఎరువుల అక్రమ వినియోగానికి అడ్డుకట్ట.. 22 శాతం ఆదా
- ఎల్‌నినోలోనూ పప్పుధాన్యాల సాగులో 99 శాతం లక్ష్యసాధన
- 80 శాతం రాయితీపై కంటింజెన్సీ విత్తనాలకు రూ.200 కోట్లు
- పంటల బీమాకు 44 లక్షల దరఖాస్తులు.. రూ.16 వేల కోట్ల బీమా రక్షణ
- రైతు సంక్షేమంలో కేంద్రం సహకారం అభినందనీయం
- సౌత్ స్టేట్స్ వ్యవసాయ మంత్రుల సదస్సులో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**హైదరాబాద్, సెప్టెంబర్ 18:అనంత జనశక్తి ప్రతినిధి**



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సాంకేతికతను రైతుకు చేరువ చేస్తూ, సాగు వ్యయాన్ని తగ్గించి, రైతుల ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగంలో వినూత్న సంస్కరణలు అమలు చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఎల్‌నినో కారణంగా ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురవుతున్నప్పటికీ రైతులకు అండగా నిలుస్తూ డిజిటల్ వ్యవసాయం, పప్పుధాన్యాల స్వయం సమృద్ధి, ఎరువుల పారదర్శక పంపిణీ, పంటల బీమా, మార్కెటింగ్ రంగాల్లో రాష్ట్రాన్ని ముందంజలో నిలుపుతున్నామన్నారు. హైదరాబాద్ లో సౌత్ స్టేట్స్ వ్యవసాయ మంత్రుల సదస్సులో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు రాష్ట్రంలో అమలు చేస్తున్న రైతు సంక్షేమ కార్యక్రమాలు, వ్యవసాయ రంగంలో తీసుకొచ్చిన సాంకేతిక సంస్కరణలను వివరించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగానికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం అందిస్తున్న సహకారానికి, ముఖ్యంగా కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

**52.08 లక్షల మంది రైతులకు ఫార్మర్ ఐడిలు**

డిజిటల్ అగ్రికల్చర్ మిషన్‌లో భాగంగా అగ్రీస్టాక్ అమల్లో ఆంధ్రప్రదేశ్ వేగంగా ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని సుమారు 60 లక్షల PMKISAN లబ్ధిదారుల్లో 52.08 లక్షల మందికి Farmer IDలు సృష్టించి 86.8 శాతం ప్రగతి సాధించామన్నారు. ఖరీఫ్-2026లో డిజిటల్ పంటల సర్వే ద్వారా సుమారు 68 లక్షల మంది రైతులకు చెందిన 97 లక్షల ఎకరాల పంట విస్తీర్ణాన్ని నమోదు చేశామని తెలిపారు. ఈ డేటాను పంట విస్తీర్ణం, దిగుబడి అంచనాలకు వినియోగిస్తున్నామని, అగ్రీస్టాక్‌ను ఎరువుల పంపిణీ, MSP కొనుగోళ్లు, ఉత్పత్తి అంచనాలు, PMFBYతో అనుసంధానం చేస్తున్నామని వివరించారు.

**APAIMS 2.0తో 22 శాతం ఎరువుల ఆదా**

ఎరువుల పంపిణీలో APAIMS 2.0 ద్వారా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రైతు వివరాలు, కమతం, విస్తీర్ణం, సాగు చేసిన పంట ఆధారంగా శాస్త్రీయ సిఫార్సుల మేరకు యూరియా, DAP పంపిణీ చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు సుమారు 24.69 లక్షల మంది రైతులు డిజిటల్ విధానంలో ఎరువులు కొనుగోలు చేశారని తెలిపారు. యూరియా విక్రయాలు 31 శాతం, DAP విక్రయాలు 32 శాతం తగ్గాయని, యూరియా వినియోగం 6.67 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి సుమారు 4.60 లక్షల మెట్రిక్ టన్నులకు తగ్గిందన్నారు. ఎల్‌నినో కారణంగా సాగు విస్తీర్ణం తగ్గడంతో ఎరువుల వినియోగం 9 శాతం తగ్గగా, APAIMS 2.0 ద్వారా అక్రమ వినియోగాన్ని అరికట్టి మరో 22 శాతం ఎరువులను ఆదా చేయగలిగామని మంత్రి వివరించారు. కృష్ణా, కాకినాడ జిల్లాల్లో పైలట్‌గా అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ ఆన్‌లైన్ ఎరువుల యాప్‌ను రబీ 2026-27లో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు వెల్లడించారు.

**అగ్రీస్టాక్‌కు కేంద్రం మరింత సహకరించాలి**

సమగ్ర డిజిటల్ వ్యవసాయ వ్యవస్థ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ సహకారం కొనసాగించాలని మంత్రి కోరారు. భూ రికార్డుల అనుసంధానంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని, జియోరిఫరెన్స్ చేసిన గ్రామ పటాల ధ్రువీకరణను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. అగ్రీస్టాక్ ఆధారిత కొనుగోళ్లు, పంటల బీమా తదితర సేవల కోసం వివిధ శాఖల మధ్య డేటా అనుసంధానాన్ని మరింత సులభతరం చేయాలని కోరారు.

**ఎల్‌నినోలోనూ పప్పుధాన్యాల్లో 99 శాతం లక్ష్యం**

ఎల్‌నినో పరిస్థితులు ఉన్నప్పటికీ పప్పుధాన్యాల సాగులో రాష్ట్రం దాదాపు 99 శాతం లక్ష్యాన్ని సాధించిందని అచ్చెన్నాయుడు తెలిపారు. సాధారణ సాగు విస్తీర్ణం సుమారు 3.4 లక్షల హెక్టార్లు కాగా కంది, మినుము, పెసర పంటల్లో కొన్ని లక్ష్యాలను మించి సాగు నమోదైందన్నారు. పప్పుధాన్యాల ఆత్మనిర్భరత మిషన్ కింద కంది, మినుముల 100 శాతం కొనుగోలుకు భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. స్వల్పకాలిక, కరువును తట్టుకునే పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, కూరగాయలు, పశుగ్రాస పంటలను ప్రోత్సహిస్తున్నామని, అవసరమైన పంటలకు ప్రభుత్వపరంగా బైబ్యాక్ భరోసా కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

**రైతుకు గిట్టుబాటు.. వినియోగదారుడికి అందుబాటు**

వ్యవసాయం, ఉద్యానవనం, పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖల సమన్వయంతో రాష్ట్రవ్యాప్తంగా 115 రైతు బజార్లను క్రియాశీలం చేశామని మంత్రి తెలిపారు. సాధారణ రైతు బజార్లతో పాటు మొబైల్, డిజిటల్ రైతు బజార్లను అనుసంధానం చేస్తున్నామన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూనే నిత్యావసర వస్తువులను ప్రజలకు అందుబాటు ధరల్లో అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

**ఎల్‌నినో ఉపశమనానికి రూ.200 కోట్లు**

ఎల్‌నినో పరిస్థితుల్లో రైతులను ఆదుకునేందుకు కంటింజెన్సీ విత్తనాలను 80 శాతం రాయితీపై అందించేందుకు రూ.200 కోట్లు కేటాయించామని అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రీమాన్‌సూన్ డ్రై సోయింగ్ కింద 32 రకాల విత్తనాలను ప్రోత్సహిస్తున్నామని, తద్వారా భూమిపై పచ్చదనం పెంచడంతోపాటు పశుగ్రాస కొరతను తగ్గించవచ్చన్నారు. అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించేందుకు డ్రిప్ ఇరిగేషన్‌ను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. నీటి కొరత ప్రాంతాల్లో అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఆగస్టు 7 నుంచి రైతు సేవా కేంద్రాల ద్వారా వ్యవసాయ, సాగునీటి, రెవెన్యూ, అనుబంధ శాఖల సమన్వయంతో క్షేత్రస్థాయిలో ఎల్‌నినో ఉపశమన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. "ప్రతి రైతు.. ప్రతి పొలం.. ప్రతి పంటను పరిశీలించి రైతుకు అవసరమైన సాంకేతిక సలహాలు అందిస్తున్నాం. ప్రస్తుతం పొలాల్లో ఉన్న పంటలను కాపాడటమే మా మొదటి ప్రాధాన్యం" అని మంత్రి స్పష్టం చేశారు.

**44 లక్షల బీమా దరఖాస్తులు.. రూ.16 వేల కోట్ల రక్షణ**

పంటల బీమా నమోదును ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమంగా చేపట్టడంతో రైతుల నుంచి భారీ స్పందన లభించిందని అచ్చెన్నాయుడు తెలిపారు. మొత్తం 44 లక్షల దరఖాస్తులు అందగా, వీరిలో 18.83 లక్షల మంది రుణ రైతులు, సుమారు 26 లక్షల మంది రుణేతర రైతులు ఉన్నారని చెప్పారు. గత ఏడాది సుమారు 2 లక్షలుగా ఉన్న రుణేతర రైతుల నమోదు ఈ ఏడాది 26 లక్షలకు పెరగడం విశేషమన్నారు. సుమారు 17 లక్షల హెక్టార్లకు దాదాపు రూ.16 వేల కోట్ల బీమా రక్షణ కల్పించామని, మొత్తం ప్రీమియం సుమారు రూ.630 కోట్లు కాగా రైతుల వాటా దాదాపు రూ.270 కోట్లుగా ఉందని వివరించారు.

**బీమా క్లెయిమ్‌లను త్వరగా పరిష్కరించాలి**

వర్షాధార వ్యవసాయ కుటుంబాలకు పంటల బీమా అత్యంత కీలకమైన ఆర్థిక భరోసా అని మంత్రి పేర్కొన్నారు. రైతుల బీమా క్లెయిమ్‌లను త్వరితగతిన పరిష్కరించాలని కేంద్రాన్ని కోరారు. PMFBY, RWBCIS కింద కేంద్ర ప్రభుత్వ వాటాను సకాలంలో విడుదల చేయడంతోపాటు పెండింగ్ బీమా క్లెయిమ్‌ల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సాంకేతికతను రైతుకు చేరువ చేసి, సాగు వ్యయాన్ని తగ్గించి, ఉత్పాదకతను పెంచి, పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ప్రకృతి ఎంత సవాల్ విసిరినా రైతును ఒంటరిగా వదిలే ప్రసక్తే లేదు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో వ్యవసాయ రంగంలో ఎదురయ్యే ప్రతి సవాల్‌ను అధిగమించి రైతును మరింత బలోపేతం చేస్తాం అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# భక్తుల కోరికలు తీర్చే కొంగు బంగారంగా శ్రీ శివ గంగ రాజరాజేశ్వరి ఆలయం

- భక్తుల సౌకర్యమే మా లక్ష్యం
- ఆలయ చైర్మన్ అల్లే కుమార్
- శ్రీ శివగంగ రాజరాజేశ్వరి ఆలయ అభివృద్ధికి నిరంతర కృషి

**మహేశ్వరం సెప్టెంబర్ 18 ( అనంత జనశక్తి ):**



భక్తుల కోరికలు తీర్చే కొంగు బంగారంగా మహేశ్వరం పరిధిలోని శ్రీ శివ గంగ రాజరాజేశ్వరి ఆలయం దినదినాభివృద్ధి చెందుతోందని, భక్తుల చల్లని చూపుతో, అమ్మవారి ఆశీస్సులతో ఆలయం అంచెలంచెలుగా ఎదుగుతోందని శ్రీ శివ గంగ రాజరాజేశ్వరి ఆలయ చైర్మన్ అల్లే కుమార్ అన్నారు.మహేశ్వరం మండలంలో ప్రసిద్ధి చెందిన శ్రీ శివగంగ రాజరాజేశ్వరి ఆలయంలో గురువారం ఆలయ అభివృద్ధి పనులను చైర్మన్ అల్లే కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరిన కోరికలు తీర్చే తల్లిగా, భక్తుల ఇంటి ఇలవేల్పుగా రాజరాజేశ్వరి అమ్మవారు పూజలందుకుంటున్నారని, అమ్మవారిని దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయనే నమ్మకంతో నిత్యం వందలాది మంది భక్తులు ఆలయానికి తరలివస్తున్నారని అన్నారు. ఆలయానికి రోజు రోజుకు పెరుగుతున్న భక్తుల సందడి దీనికి నిదర్శనమని తెలిపారు.

**అమ్మవారి ఆలయానికి నూతన పెయింటింగ్ శోభ:**

ఆలయ అభివృద్ధిలో భాగంగా అమ్మవారి ప్రధాన ఆలయానికి, ఆలయ ప్రాంగణానికి ఆకర్షణీయమైన రంగులతో పెయింటింగ్ పనులు చేపడుతున్నామని చైర్మన్ అల్లే కుమార్ వెల్లడించారు. గత కొంతకాలంగా వాతావరణ పరిస్థితుల వల్ల పెయింటింగ్ కొంత మసకబారడంతో, ఆలయానికి నూతన శోభ తీసుకువచ్చేందుకు నాణ్యమైన రంగులతో పెయింటింగ్ వేయిస్తున్నామని చెప్పారు. ఆలయ గోపురం, చుట్టూ ఉన్న ప్రహరీ గోడలు, లోపలి మండపాలకు సరికొత్త హంగులు అద్దుతున్నామని తెలిపారు.

**భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట ఏర్పాట్లు:**

భక్తులకు ఎప్పుడు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో క్యూ లైన్ల నిర్వహణ, తాగునీటి సౌకర్యం, భక్తులకు నీడ ఉండేలా షెడ్ల ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణ, పార్కింగ్ సౌకర్యం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు.

ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలతో వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఆలయ సిబ్బందికి ఇప్పటికే తగు సూచనలు జారీ చేశామని పేర్కొన్నారు. పండుగలు, ప్రత్యేక పర్వదినాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా అదనపు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

**ఆలయ అభివృద్ధికి నిరంతర కృషి:**

శ్రీ శివ గంగ రాజరాజేశ్వరి ఆలయాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ ఆలయంగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని చైర్మన్ అల్లే కుమార్ అన్నారు. ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని, ఇందులో భాగంగా ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టబోతున్నామని వెల్లడించారు.ఆలయ అభివృద్ధికి భక్తులు, దాతలు, గ్రామ పెద్దలు అందిస్తున్న సహకారం మరువలేనిదని, వారి సహకారంతోనే ఆలయం ఇంతగా అభివృద్ధి చెందుతోందని ఆయన కొనియాడారు. భక్తులంతా అమ్మవారిని దర్శించుకుని, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

# ఉదయంపూట కేవలం 7 నిమిషాలు ఈ వ్యాయామాలు చేయండి చాలు, బరువును తగ్గించి ఫిట్‌గా ఉండొచ్చు



బరువు తగ్గాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. కానీ ఎలా తగ్గాలో తెలియక ఇబ్బందిపడతారు. బరువు తగ్గాలని నిర్ణయించుకున్నప్పటికీ సమయం లేకపోవడం వల్ల వ్యాయామం చేయలేకపోతున్నారు. ఇలాంటి వాళ్లు రోజులో కేవలం ఏడు నిమిషాల సమయం కేటాయించండి చాలు. ఆ ఏడు నిమిషాల పాటూ ఇక్కడ చెప్పిన ఎక్సర్ సైజులు చేస్తే బరువు తగ్గే అవకాశాలు ఎక్కువ. కాబట్టి మీరు ఉదయం 7 నిమిషాలు మాత్రమే వ్యాయామం చేయడం వల్ల ఫిట్ గా ఉండవచ్చు. ఈ వ్యాయామాలు చేస్తే చాలు కొద్ది రోజుల్లోనే మీ శరీరంలో వచ్చే మార్పులను సులభంగా చూడగలుగుతారు. ఈ వ్యాయామాలను ప్రతిరోజూ ఉదయం 7 నిమిషాల్లో ఇంట్లోని ఏ మూలననైనా చేయండి.



## జంపింగ్ జాక్స్

ఇంట్లోనే జంపింగ్ జాక్స్ వ్యాయామం చేసుకోవచ్చు. మీరు మీ ఫిట్నెస్ ప్రయాణాన్ని ప్రారంభించాలనుకుంటే, దీనితో ప్రారంభించండి. కాళ్ళు చాచి నిలబడి చేతులను పైకి లేపండి. ఆ తర్వాత బౌన్స్ చేసి కాళ్లు దగ్గరకు తెచ్చి చేతులను కిందకు దించాలి. ఇదే ప్రక్రియను పదేపదే చేయండి. చేతులు, కాళ్ళను పైకి చాచి, వాటిని ఒకచోట చేర్చండి. కేవలం 30 సెకన్లలో వేగంగా కదలండి లేదా మీకు అధిక బరువు ఉంటే, నెమ్మదిగా చేయండి.

## గోడ కుర్చీ

ముప్పై సెకన్ల పాటు మోకాళ్లను గోడకు సపోర్టుగా 90 డిగ్రీల వద్ద వంచి కుర్చీలో కూర్చున్నట్టు గోడ కుర్చీ వంటి భంగిమ చేయాలి. 30 సెకన్ల పాటు అలా ఉండాలి. తరువాత నిలబడండి. మీరు కొన్ని రోజుల తరువాత వ్యాయామం



చేయడం ప్రారంభించిన తర్వాత మళ్లీ మళ్లీ చేస్తూ ఉండాలి.

## పుషప్స్

ప్లాంక్ పొజిషన్ లోకి వచ్చి, ఆపై మోచేతులతో చేతులను వంచి, శరీరాన్ని నేలపై విశ్రాంతి తీసుకోవడానికి ప్రయత్నించండి. తరువాత ఎత్తడానికి ప్రయత్నించండి. పుషప్ లను సులభతరం చేయడానికి,



ప్రారంభంలో మోకాళ్లను నేలపై ఉంచి పుషప్ లు చేయండి. ఇది పుషప్ లను ప్రారంభించడం సులభం చేస్తుంది. ఆ తర్వాత క్రమంగా మీ స్థాయిని పెంచుకోండి.

## స్టెప్ అప్

కుర్చీ లేదా మెట్లపై ఒక్కో కాలిని పెట్టి మళ్లీ కిందకి దించండి. ఇలా రెండు కాళ్లతో ఒకదాని తరువాత ఒకటి చేయండి.

ఇది శరీరాన్ని ఫిట్ గా ఉంచేందుకు ఉపయోగపడుతుంది.

## స్క్వాట్

ఈ వ్యాయామాన్ని 30 సెకన్ల పాటూ చేయండి. మీ కాళ్ళపై నిలబడండి. భుజాలు, పాదాలను సమాన దూరంలో ఉంచండి. ఇప్పుడు మోకాళ్లను 90 డిగ్రీల వద్ద వంచి, ఆపై లేచి నిలబడాలి. అలాంటి పొజిషన్ లో కుర్చీలో కూర్చొని నిలబడినట్టుగా ఉంటుంది.

ఒకే ప్రదేశంలో నిలబడి పరిగెత్తండి. ఈ సమయంలో, మోకాళ్ళను ఛాతీకి లేదా బొడ్డుకు వీలైనంత ఎత్తుకు తీసుకురావడానికి ప్రయత్నించండి. ఈ వ్యాయామాన్ని 30 సెకన్ల పాటు చేయండి. దీన్ని మరింత ప్రభావవంతంగా చేయడానికి, అరచేతులను విస్తరించండి. వాటిని నడుము దగ్గర ఉంచండి.

# పీరియడ్స్ సమయంలో పొట్టనొప్పే కాదు కొందరు మహిళల్లో కాలు నొప్పి కూడా వస్తుంది, ఎందుకు?





చాలా మంది స్త్రీలకు రుతుస్రావం సమయంలో ఎన్నో సమస్యలు వస్తాయి. పొత్తికడుపు నొప్పి, రొమ్ము, వెన్నునొప్పి వంటివి ఎక్కువగా కనిపిస్తాయి.ఈ నెలసరి నొప్పి కొన్నిసార్లు కాళ్ల వరకు వ్యాపిస్తుంది. రుతుస్రావం సమయంలో హార్మోన్లలో విపరీతమైన మార్పుల వల్ల స్త్రీలకు కాలు నొప్పి వంటి సమస్యలు వస్తూ ఉంటాయి. అయితే కాళ్ల నొప్పులు భరించలేనంతగా మారుతుంటే అది కూడా మీకు ఆరోగ్య సమస్య ఉందనడానికి సంకేతం కావచ్చు. నెలసరి సమయంలో కాళ్ల నొప్పులను ఎలా తగ్గించుకోవాలో తెలుసుకుందాం.







## పీరియడ్స్ లో కాళ్ల నొప్పులకు కారణం ఏమిటి?

రుతుచక్రం సమయంలో ప్రోస్టాగ్లాండిన్ హార్మోన్ స్రవించే రేటు ఎక్కువగా ఉంటుంది. ప్రోస్టాగ్లాండిన్ గర్భాశయంలోని కండరాలపై పనిచేస్తుంది. ప్రోస్టాగ్లాండిన్లు గర్భాశయ సంకోచాలకు, ఎండోమెట్రియంను బయటకు పంపడానికి సహాయపడతాయి. ప్రోస్టాగ్లాండిన్ శరీరంలో మంటను కలిగిస్తుంది. దీనివల్ల వీపు, కాళ్ళు, దిగువ వీపులలో నొప్పి వస్తుంది.

ఇది కాకుండా, కొన్ని సందర్భాల్లో, రుతుస్రావం సమయంలో అధిక కాలు నొప్పి కూడా వస్తుంది. ఇది మీ శరీరంలో ఏదో లోపం ఉందని చెప్పే లక్షణం కావచ్చు.

రుతుస్రావం సమయంలో కాళ్ల నొప్పులకు ఫైబ్రాయిడ్లు కారణం కావచ్చు. ఇది రుతుస్రావం సమయంలో తీవ్రంగా ఉంటుంది. ఎండోమెట్రియోసిస్ అనేది గర్భాశయం వెలుపల గర్భాశయం పొర పెరగడం ప్రారంభించే ఆరోగ్య పరిస్థితి. ఇది కాలు నొప్పికి కూడా దారితీస్తుంది. 2018 లో ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం, సయాటిక్ నరాలపై ఎండోమెట్రియాటిక్ పెరుగుదల తుంటి, కాళ్ళలో నొప్పికి దారితీస్తుంది.

మరీ బిగుతుగా ఉండే దుస్తులు ధరించడం వల్ల రక్త ప్రసరణలో సమస్యలు వస్తాయి. కాబట్టి వీలైనంత సౌకర్యవంతంగా ధరించాలని నిపుణులు సలహా ఇస్తున్నారు.పీరియడ్స్ లో వచ్చే కాలు నొప్పి ఎలా ఉంటుంది?

ఈ నొప్పి రుతుచక్రం సమయంలో లేదా రుతుచక్రానికి కొద్ది గంటల ముందు ప్రారంభమవుతుంది. కొన్నిసార్లు ఇది రుతుస్రావానికి ఒక రోజు ముందు కూడా కనిపిస్తుంది. ఈ నొప్పికి ఎటువంటి వైద్య సహాయం అవసరం లేదు. ఇంటి నివారణల సహాయంతో నయం అయిపోతుంది. అలాకాకుండా ఈ కాళ్ల నొప్పులు రుతుస్రావానికి వారం ముందు ప్రారంభమైతే మాత్రం తేలికగా తీసుకోకూడదు. ఆ నొప్పిని సాధారణ నొప్పిగా చెప్పలేము. ఈ సందర్భంలో మీరు వైద్యుడిని సంప్రదించడం చాలా మంచిది.

నెలసరి సమయంలో వచ్చే సాధారణ కాళ్ల నొప్పులను దూరం చేసుకోవడానికి హీట్ బ్యాగులను ఉపయోగించవచ్చు. ఇది మీ కండరాలను రిలాక్స్ చేస్తుంది. అయితే 30 నిమిషాల పాటు నెమ్మదిగా నడవడానికి ప్రయత్నించండి. ఎక్కువ అలసటను కలిగించని సులభమైన ఆసనాలు చేయండి. శరీరంలో నీటి పరిమాణాన్ని సమతుల్యం చేయడానికి కొబ్బరి నీరు త్రాగాలి.

## వీటిని తినడం మానండి

పీరియడ్స్ కు కనీసం వారం రోజుల ముందు ఉప్పు, స్పైసీ, షుగర్ ఫుడ్స్ తగ్గించండి. ఇలా చేయడం వల్ల కండరాల్లో నొప్పి తగ్గుతుంది. తద్వారా నెలసరి సమయంలో కాస్త రిలాక్స్ గా ఫీల్ అవుతారు. రుతుచక్రం సమయంలో తీవ్రమైన నొప్పితో బాధపడుతుంటే, నొప్పిని భరించలేకపోతే డాక్టర్ ను కలవడం మంచిది.

# 6నెలల్లో వెయ్యికోట్లు

'పుష్పా' ఫ్రాంచైజీ, యానిమల్, ఛావా, సికిందర్, ది గర్ల్‌ఫ్రెండ్ సినిమాలతో ఓకే ఏడాది వేలకోట్ల వసూళ్లు రాబట్టి సినీ సామ్రాజ్యానికి క్వీన్‌గా అవతరించింది రష్మిక మందన్న. ఇక ఏ హీరోయిన్‌కైనా ఈ స్థాయి ట్రాక్ రికార్డు కష్టమే అని అంతా అనుకుంటున్న తరుణంలో ఉన్నట్టుండి మలయాళ భామ మమితాబైజు ఊడిపడింది. ఆర్నెల్ల క్రితం ధనుష్‌తో ఆమె నటించిన 'కర' సినిమా పెద్దగా ఆడలేదు. కానీ 50కోట్ల వసూళ్లు రాబట్టింది. ఇక అక్కడ్నుంచి మొదలైంది మమితాబైజు విజయవిహారం.

ప్రదీప్ రంగనాథ్‌తో ఆమె నటించిన 'డ్యూడ్' సినిమా వందకోట్ల వసూళ్లు రాబట్టింది. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌తో కలిసి నటించిన 'జననాయగన్' 300కోట్లు, రీసెంట్‌గా విడుదలైన మలయాళ చిత్రం 'బెత్లహోమ్ కుటుంబ యూనిట్' చిత్రం 300కోట్లు, సూర్య తాజా బ్లాక్‌బస్టర్ 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో 260కోట్లు.. ఇలా కేవలం ఆరు నెలల వ్యవధిలోనే తన సినిమాల వసూళ్లతో వెయ్యికోట్ల మార్క్‌ని దాటేసింది మమితా బైజు. ఆమె నటించిన మూడు సినిమాలు వరుసగా 200కోట్ల వసూళ్లు రాబట్టడం విశేషం.



# హీరో సుహాస్‌పై వర్ణ వివక్ష విమర్శలు



గ్లామర్ ప్రపంచమైన సినిమా రంగంలో టాలెంట్ ముఖ్యం కానీ రంగు, రూపాలు కాదనే విషయం మరోసారి చర్చనీయాంశమైంది. తాజాగా 'మండాడి' సినిమా సక్సెస్ ఈవెంట్‌లో ఆ చిత్ర దర్శకుడు చేసిన వ్యాఖ్యలు ఇండస్ట్రీలో సంచలనం సృష్టించాయి. తన సినిమాలో నటించిన టాలీవుడ్ నటుడు సుహాస్ కెరీర్ ఆరంభంలో ఎదుర్కొన్న అవమానాల గురించి ఆ దర్శకుడు ప్రస్తావించారు. సుహాస్ నల్లగా ఉన్నాడంటూ కొందరు తీవ్రమైన కామెంట్లు చేశారని, తన సొంత ఊర్లోనూ రంగును బేస్ చేసుకుని కొందరు ఎద్దేవా చేశారని సుహాస్ ఎమోషనల్ అయిన విషయాన్ని ఆ డైరెక్టర్ గుర్తుచేసుకున్నారు. తమిళనాడు వంటి ప్రాంతాల్లో రంగు ఆధారంగా వివక్ష చూపించరని, ఏ నటుడిని వారి కలర్ ఆధారంగా అంచనా వేయకూడదని ఆయన పేర్కొన్నారు. అయితే ఈ వ్యాఖ్యలు టాలీవుడ్‌ని ఉద్దేశించి దర్శకుడు చేశాడని పలువురు తప్పుబడుతున్నారు. తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ నటుల రంగును బట్టి వారిని అంచనా వేయరని. స్నేహితుల మధ్య సరదాగా లేదా చిన్నతనంలో రంగును ఉద్దేశించి చేసుకునే కామెంట్లను కొందరు పెద్దవి చేసి చూడటం సరికాదని అభిప్రాయపడుతున్నారు.

## అమ్మాయిల చదువు కోసం..

# సెలబ్రిటీల 'సంకల్ప్'



ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను పూర్తి చేసుకున్న సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబరు 17 వరకు దేశవ్యాప్తంగా 'సేవా సంకల్ప్ అభియాన్' పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీటిల్లో సినీ సెలబ్రిటీలూ భాగమవుతున్నారు. తాజాగా ముంబయిలో లాల్‌బాగ్‌చా రాజాను దర్శించుకున్న రణ్‌వీర్ సింగ్ , రణ్‌బీర్ కపూర్, అలియా భట్ వారు చేయనున్న మంచి పనుల గురించి వివరించారు. "నేను 'సేవా సంకల్ప్ అభియాన్'లో చేరి 1,000 మంది బాలికలను చదివిస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. ఈ మంచి పనిని వినాయకుడు నా వెనక ఉండి నడిపిస్తాడని నమ్ముతున్నాను" అని రణ్‌వీర్ తెలిపారు. అలియా భట్ , రణ్‌బీర్ కపూర్ కూడా ముందుకు వచ్చి.. ముంబయిలోని 20 పాఠశాలలను పునరుద్ధరించే బాధ్యతను స్వీకరించనున్నట్లు చెప్పారు. ఇక ఇప్పటికే ఈ కార్యక్రమంలో అగ్ర కథానాయకుడు రామ్ చరణ్ కూడా భాగమైన విషయం తెలిసిందే. సెప్టెంబర్ 17న మోదీ పుట్టినరోజు సందర్భంగా ఆయన సోషల్ మీడియా వేదికగా ఓ ప్రకటన చేశారు. 1000 మంది మహిళలకు ఉచితంగా స్కిల్ డెవలప్‌మెంట్ (నైపుణ్యాభివృద్ధి) శిక్షణ అందించనున్నట్లు ప్రకటించారు.

# కత్రినాకు మద్దతుగా నిలిచిన నటి




బాలీవుడ్ నటి కత్రినా కైఫ్ ప్రసవానంతరం బరువు పెరిగారంటూ సోషల్ మీడియాలో పలువురు విమర్శలు గుప్పించారు. వీటిపై నటి సోనారికా భడోరియా స్పందించారు. తల్లి అయిన తర్వాత మహిళల శరీరంలో వచ్చే మార్పులను ప్రశ్నించడం సరికాదన్నారు. కత్రినాకు మద్దతు తెలుపుతూ పోస్ట్ పెట్టారు. ఇది కేవలం కత్రినాకు సంబంధించిన విషయం మాత్రమే కాదని.. ప్రతి మహిళా ఇలాంటి ట్రోలింగ్‌ను ఎదుర్కొంటున్నారన్నారు. "బిడ్డకు జన్మనివ్వడం చిన్న విషయం కాదు. ఆ సమయంలో మహిళ శరీరం ఎన్నో మార్పులకు లోనవుతుంది. ప్రసవం తర్వాత కోలుకునేందుకు ఒక్కొక్కరికి ఒక్కో సమయం పడుతుంది. అలాంటప్పుడు ఆమె ఎలా కనిపిస్తోంది? ఎంత బరువు పెరిగింది? అనే దానికంటే.. ఆమె బిడ్డకు జన్మనివ్వడం కోసం ఎంత కష్టపడింది.. ఆ బిడ్డను పెంచడం కోసం ఎన్ని నిద్రలేని రాత్రులు గడపనుంది.. వంటివి అర్థం చేసుకోవడం ముఖ్యం. తల్లి కావడానికి మహిళలు సర్వస్వం త్యాగం చేయాలని చెప్పే ఈ ప్రపంచంలో.. మాతృత్వం అనంతరం ఆమె శరీరంలో ఎలాంటి మార్పు రాకూడదని ఆశించే వాళ్లు కూడా ఉండడం సిగ్గుపడాల్సిన విషయం" అని అన్నారు.

# వైభవ్ ఇంకొంత కాలం వేచి చూడాల్సిందే..: గంభీర్





అఫ్గానిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్‌లో ఒక్క మ్యాచ్‌లోనూ వైభవ్ సూర్యవంశీకి అవకాశం దక్కలేదు. సంజు శాంసన్ వైపే టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్ మొగ్గు చూపింది. ఈ క్రమంలో వైభవ్‌ను ఎందుకు ఎంపిక చేయలేదనే ప్రశ్నలు తలెత్తాయి. జింబాబ్వే టూర్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచిన సంగతి తెలిసిందే. దీనిపై భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ సమాధానం ఇచ్చాడు. అలాగే ఇంగ్లాండ్ సిరీస్‌లో సంజుకు బదులు వైభవ్‌కు అవకాశం కల్పించడం కూడా తన కోచింగ్ కెరీర్‌లో అత్యంత క్లిష్టమైన నిర్ణయమని వ్యాఖ్యానించాడు. "సంజు శాంసన్ సత్తా ఏంటో మనందరికీ తెలుసు. టాలెంట్ లేకుండా ఎవరూ వరల్డ్ కప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలవలేరు. జట్టుకు కావాల్సింది చేశాడు. అందుకే, అతడిని పక్కన పెట్టడమనేది నా కెరీర్‌లో అత్యంత కఠినమైన నిర్ణయం. ఇంగ్లాండ్ సిరీస్‌లో ఆడించలేకపోయా. అయితే, కొన్నిసార్లు ఆటగాళ్ల ప్రస్తుత ఫామ్‌ను కూడా పరిగణనలోని తీసుకోవాలి. నా దృష్టిలో వరల్డ్ కప్ కాంబినేషన్‌నే కొనసాగిస్తే మంచిదనిపించింది. ఏదో మూడు, నాలుగు సార్లు విఫలమైనంత మాత్రాన అకస్మాత్తుగా చెత్త ఆటగాళ్లుగా మారిపోరు. ప్రపంచ కప్ నుంచి మరో ప్రపంచ కప్ వరకు అజేయంగా నిలిచి, టైటిల్ గెలిచిన జట్టు అది. కేవలం ఒక సిరీస్ ఫలితం ఆధారంగా జట్టును తక్కువ అంచనా వేయలేం" అని గంభీర్ తెలిపాడు.

# మహిళా అథ్లెట్.. పురుష కోచ్‌కు ఒకే రూమ్?




ఆసియా గేమ్స్ లో వసతి ఏర్పాట్లపై విమర్శలు వస్తూనే ఉన్నాయి. భారత బృందం అక్కడ అడుగు పెట్టినప్పటి నుంచి.. వసతి కోసం గంటల తరబడి వేచి చూడటంతో అథ్లెట్లు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తాజాగా మరో అంశం వెలుగులోకి వచ్చింది. మహిళా జిమ్నాస్టిక్ ప్రణతి నాయక్, ఆమె కోచ్ అశోక్ మిశ్రాకు ఒకే గది కేటాయించడం గమనార్హం. క్రూయిజ్ షిప్‌లో ఇద్దరికీ ఒకే గదిని కేటాయించినట్లు నిర్వాహకులు భారత అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో మహిళ-పురుషుడికి కలిపి ఒకే గదిని ఎలా ఇస్తారని తీవ్ర విమర్శలు వచ్చాయి. వెంటనే సమస్యను నిర్వాహకులకు తెలియజేసినా.. గంటల తరబడి పరిష్కారం చూపించలేదని భారత వర్గాలు పేర్కొన్నాయి. చివరికి భారత ఒలింపిక్ అసోషియేషన్ కలగజేసుకొని ఏర్పాట్లు చేసింది. అది అయ్యేసరికి అర్ధరాత్రి ఒకటిన్నర అయినట్లు సమాచారం.

# చరిత్రకు అడుగు దూరంలో!



టేబుల్ టెన్నిస్ + ఫుట్‌బాల్‌ను కలిపి ఆడితే టెక్‌బాల్ అవుతుంది. టీటీ టేబుల్‌పైన చేతులతో కాకుండా మిగతా శరీరంతో ఫుట్‌బాల్‌లా తలపడటమే టెక్‌బాల్. 2017లో తొలిసారి టెక్‌బాల్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ నిర్వహించారు. 2018-19లో భారత్‌లో ప్రవేశించిన ఈ ఆటకు.. ఇప్పుడిప్పుడే ఆదరణ పెరుగుతోంది. భారత్ నుంచి ఈసారి ఆసియా క్రీడల్లో ముగ్గురు బరిలోకి దిగారు. మెన్స్ డబుల్స్‌లో ఓడిపోగా.. మహిళల సింగిల్స్‌లో క్విమ్సి డిసౌజా సెమీస్‌కు చేరి ఆశ్చర్యపరిచింది. శనివారం కూడా గెలిస్తే.. ఫైనల్‌కు చేరుకుంటుంది. అప్పుడు పతకం ఖాయం కానుంది. మరోవైపు మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ అనాస్ ఇమ్రాన్ బెగ్‌తో కలిసి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. ముంబయిలో జన్మించిన క్విమ్సి డిసౌజా తన కెరీర్‌ను ఫుట్‌బాల్ ప్లేయర్‌గా మొదలుపెట్టింది. మహారాష్ట్ర తరపున అండర్-19 ఫుట్‌బాల్ మ్యాచులు ఆడింది. అయితే, 2022 నుంచి టెక్‌బాల్ గేమ్‌కు మారిపోయింది. కేవలం నాలుగేళ్ల వ్యవధిలోనే ఆసియా గేమ్స్‌లో తలపడేంత స్థాయికి ఎదిగింది. ఫుట్‌బాల్ ఆటలో అనుభవం ఉండటం ఆమెకు కలిసొచ్చింది. ఏడుసార్లు జాతీయ ఛాంపియన్‌గా అవతరించింది. భారత్‌లో టెక్‌బాల్ విస్తరణలో కీలక పాత్ర పోషించే బెంగళూరు క్లబ్‌తో కలిసి పని చేసింది. మరోవైపు డెకాథ్లాన్‌లో టెస్ట్ ఇంజినీర్‌గానూ బాధ్యతలు నిర్వర్తించనుండటం గమనార్హం.

# ఆసియా గేమ్స్‌లో అథ్లెట్లకు వసతి కష్టాలు

నగోయా: భారీ అంచనాలతో, పతక ఆశలతో ఆసియా గేమ్స్ కోసం ఆతిథ్య జపాన్‌లోని ఐచి నగోయాకు చేరుకున్న భారత్‌తో పాటు పలు దేశాల క్రీడాకారులకు సమస్యలు స్వాగతం పలికాయి. సరైన సౌకర్యాలు లేకపోవడం, వేదికలకు సుదూర ప్రాంతాల్లో వసతి కేటాయించడంతో వేలాది మంది అథ్లెట్లు, కోచ్‌లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగోయా పోర్ట్‌లో నిలిపి ఉంచిన 'కోస్టా సెరెనా' క్రూయిజ్ షిప్‌లోఇద్దరు ఉండే చిన్న గదిలో ముగ్గురు అథ్లెట్లను ఉంచడంతో భారత రోయింగ్, ఉషూ, టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నారు. థాయిలాండ్ అథ్లెట్లు గదులు దొరక్క క్రూయిజ్ షిప్ వెల్కమ్ సెంటర్‌లోని నేలపైనే నిద్రించారు. మను భాకర్, ఇషా సింగ్ వంటి స్టార్లతో కూడిన భారత షూటింగ్ బృందానికి షూటింగ్ రేంజ్ నుంచి 50 కి.మీ దూరంలో హోటల్ కేటాయించారు. దీంతో రోజూ 2 గంటల ప్రయాణం చేయాల్సి వస్తోందని వారు వాపోతున్నారు.







PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945